# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | బుధవారం - 14 - మే - 2025 | సంపుటి : 2 | సంచిక : 353 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


ఇది నవయుగ భారతం. దేశం శాంతినే కోరుకుంటుంది. కానీ శాంతిమయ మానవత్వంపై దాడి చేస్తే ఊరుకోం. అవసరమైనప్పుడు సమరమూ చేస్తాం.
యుద్ధక్షేత్రంలో శత్రువును ఎలా అణగదొక్కాలో భారత్‌కు బాగా తెలుసు. వాయుసేన వేగం, సత్తా చూసి పాకిస్తాన్ నిద్రలేని రాత్రులు గడిపింది. సమరంలో నేరుగా పోరాడే దమ్ములేక వైమానిక స్థావరంలో పౌరవిమానాలను ముందు నిలిపి పాక్ వక్రబుద్ధిని ప్రదర్శించింది. అయినా వాయుసేన కచ్చితత్వంతో పాక్ సాయుధ సంపత్తి, వైమానిక స్థావరాలనే గురిచూసి కొట్టింది.
– ప్రధాని మోదీ



# పాక్‌కు దిమ్మదిరిగేలా బుద్ధి చెప్పారు..

## భవిష్యత్తు తరానికి మీరంతా ఆదర్శం: ప్రధాని మోదీ

- ప్రధాని మోదీ ఆదంపూర్ ఎయిర్‌బేస్ సందర్శన
- సైనికుల పరాక్రమానికి అభినందన
- ఆపరేషన్ సింధూర్‌పై ప్రధాని ప్రశంస
- బుద్ధుడి, గురుగోవింద్ సింగ్ నేలపై గర్వం
- అణుబాంబు హెచ్చరికలపై భారత సైన్యం ప్రతిస్పందన
- భారత సైన్యం – భవిష్యత్తు తరాలకు ప్రేరణ

(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు)

దుష్టదేశ గగనతలాన్ని చీల్చుకుంటూ దూసుకెళ్లి ముష్కర మిన్నాగుల పుట్టలను నేలమట్టంచేస్తూ, దాయాది దేశం యుద్ధం ఆపాలని కాళ్లబేరానికి వచ్చే స్థాయిలో శత్రువుల వైమానిక స్థావరాలను తుత్తునియలు చేసి తిరుగులేని ధైర్యసాహసాలను ప్రదర్శించిన భారత వాయుసేనను ప్రధాని మోదీ పొగడ్తల్లో ముంచెత్తారు. పాక్ సరిహద్దుకు కేవలం 100 కిలోమీటర్ల దూరంలోని పంజాబ్‌లోని ఆదంపూర్ వైమానిక స్థావరానికి స్వయంగా వెళ్లి అక్కడి వాయుసేన బలగాలపై ప్రధాని ప్రశంసల జల్లు కురిపించారు. వారి అసమాన పోరాట పటిమను భుజం తట్టి ప్రోత్సహించి పొగిడారు. తర్వాత అక్కడి ఎయిర్‌ఫోర్స్ జవాన్లనుద్దేశించి దాదాపు అరగంటపాటు ప్రసంగించారు. మరోసారి తెగించేందుకు దుస్సాహసం చేయొద్దని సరిహద్దు వెంట భారతవాయుసేన బలగాలు లక్ష్మణరేఖ గీశాయని మోదీ వ్యాఖ్యానించారు. ఆదంపూర్ వైమానిక స్థావరంలోని భారత అత్యంత అధునాతన గగనతల రక్షణ వ్యవస్థ అయిన సుదర్శన చక్ర(ఎస్-400) మిస్సైల్ లాంఛర్లను ముక్కలుచెక్కలు చేశామని పాక్ పలికిన ప్రగల్భాలన్నీ ఉత్తమాటలని నిరూపిస్తూ మోదీ మంగళవారం ఆ ఎయిర్‌డిఫెన్స్ సిస్టమ్ ఎదుటే నిలబడి ప్రసంగించారు.

మిగతా 2లో..

## బీఆర్ఎస్ నాయకత్వ బాధ్యతలు కేటీఆర్‌కి ఇస్తే స్వాగతిస్తా: హరీష్ రావు



(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

బీఆర్ఎస్ లో విభేదాలున్నాయంటూ గత కొంత కాలంగా వస్తున్న రూమర్లకు ఆ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే హరీష్ రావు చెక్ పెట్టారు. అసలు బీఆర్ఎస్ లో విభేదాలున్నాయనే వార్తల్లో నిజం లేదన్నారు. దీనిపై ఈరోజు(మంగళవారం) హరీష్ రావు క్లారిటీ ఇచ్చారు. ' మా పార్టీ బీఆర్ఎస్ లో ఎలాంటి విభేదాలు లేవు. కేటీఆర్‌కు బాధ్యతలు అప్పగిస్తే స్వాగతిస్తా. మా అధ్యక్షుడు కేసీఆర్ ఆదేశాలను పాటిస్తా' అని హరీష్ రావు స్పష్టం చేశారు. కాగా, ఎప్పట్నుంచో 'బీఆర్ఎస్ లో విభేదాలు' అనే మాట తరచు వినిపిస్తూ వస్తోంది. ప్రధానంగా కేసీఆర్ తర్వాత బీఆర్ఎస్ బాధ్యతల్ని ఎవరు మోస్తారు అనేది ప్రధానంగా నడిచే చర్చ. ఇక్కడ కేసీఆర్ తనయుడు కేటీఆర్ ఆ బాధ్యతల్ని తీసుకుంటారా?, లేక మేనల్లుడైన హరీష్ రావు తీసుకుంటారా? అనే దానిపై రకరకాల కథనాలు వచ్చాయి. ఒకవేళ కేటీఆర్‌కు బాధ్యతలు అప్పగిస్తే, హరీష్ రావు పరిస్థితి ఏంటి?, హరీష్ రావు మరొక పార్టీ వైపు కన్నేస్తారా? అనేదే ప్రధానంగా నడిచిన చర్చ. దీనికి ముగింపు పలికారు హరీష్ రావు.
తమ పార్టీలో విభేదాలు లేవని, కేటీఆర్ కు బాధ్యతలు అప్పగిస్తే తనకేమీ అభ్యంతరం లేదనే విషయాన్ని తేల్చిచెప్పారు. , దాన్ని తాను స్వాగతిస్తానన్నారు. తమ అధినేత కేసీఆర్ ఆదేశాలను పాటిస్తానన్నారు హరీష్ రావు.
సీఎం రేవంత్ రెడ్డిపై హరీష్ రావు మరోసారి మండిపడ్డారు. ధాన్యం అమ్ముకోవడానికి రైతులు యుద్ధం చేస్తుంటే.. రేవంత్ మాత్రం అందాల పోటీల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ అందాల పోటీల్లో బిజీగా ఉన్నారంటూ సెటైర్లు వేశారు. సీఎం రేవంత్ ధాన్యం రాశులు వదిలేసి అందాల రాశుల చుట్టూ తిరుగుతున్నారని చమత్కరించారు. రైతు సమస్యలపై సమీక్ష చేయడానికి సీఎం రేవంత్‌కు టైమ్ లేదని, రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనన్నారు.

## హరీష్ రావు మాటలకు మంత్రి ఉత్తమ్ కౌంటర్



(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

సీఎం రేవంత్ రెడ్డి ధాన్యం కొనుగోళ్లను వదిలేసి అందాల పోటీల చుట్టూ తిరుగుతున్నారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు చేసిన వ్యాఖ్యలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటరిచ్చారు. ఈ మేరకు ధాన్యం కొనుగోళ్ల లెక్కలను విడుదల చేశారు ఉత్తమ్. ఈ ఏడాది రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసినట్లు ఉత్తమ్ పేర్కొన్నారు. 43.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ప్రతి విషయంలో తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని హరీష్‌కు ఉత్తమ్ హితవు పలికారు. ఒకసారి హరీష్ లెక్కలు చూసి మాట్లాడితే మంచిదని సూచించారు. ధాన్యం అమ్ముకోవడానికి రైతులు యుద్ధం చేస్తుంటే.. రేవంత్ మాత్రం అందాల పోటీల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ అందాల పోటీల్లో బిజీగా ఉన్నారంటూ సెటైర్లు వేశారు. సీఎం రేవంత్ ధాన్యం రాశులు వదిలేసి అందాల రాశుల చుట్టూ తిరుగుతున్నారని చమత్కరించారు. రైతు సమస్యలపై సమీక్ష చేయడానికి సీఎం రేవంత్‌కు టైమ్ లేదని, రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనని హరీష్ రావు వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కౌంటరిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ లాగ కాదని, ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు ఇందిరమ్మ ఇండ్ల కోటా ఇస్తామన్నారు పొంగులేటి. ఇక ఏపీలో కలిసిన ప్రజల స్థానికతపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు.



### చార్మినార్ వద్ద సుందరీమణుల
# హెరిటేజ్ వాక్

హెరిటేజ్ వాక్‌లో భాగంగా నగరంలోని పాతబస్తీలో మిస్ వరల్డ్-2025 కంటెస్టెంట్‌లు సందడి చేశారు. చార్మినార్‌కు చేరుకున్న సుందరీమణులకు సంప్రదాయ అరబ్బీ మర్ఫా సంగీతంలో స్వాగతం పలికారు. చార్మినార్ అందాలు, చుట్టుపక్కల ప్రాంతాలను వారంతా సందర్శించారు. పాతబస్తీలోని చారిత్రక లాడ్ బజార్‌లో ఎంపిక చేసిన పలు దుకాణాల్లో సుందరీమణులు గాజులు కొనుగోలు చేశారు.

వివరాలు 3లో..

## ఉగ్రవాదాన్ని ప్రోత్సహించిన పాకిస్తాన్ పరిణామాలను ఎదుర్కోక తప్పదు: భారత్ ఘాటు హెచ్చరిక

- ఉగ్రవాదానికి పాక్ మద్దతు కొనసాగినంత వరకు సింధూ జలాల ఒప్పందం నిలిపివేత కొనసాగుతుంది
- ఉగ్రస్థావరాలపై దాడులు, పాక్ ప్రతిచర్యకు భారత్ కౌంటర్ అటాక్ – విదేశాంగ శాఖ వివరణ
- పాక్ ఆక్రమిత కశ్మీర్ పరిష్కారానికి ద్వైపాక్షిక చర్చలే మార్గమని భారత్ స్పష్టం
- డీజీఎంవో స్థాయిలో కాల్పుల విరమణ చర్చలు
- అమెరికా మధ్యవర్తిత్వ వాదనను తోసిపుచ్చిన భారత్



(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు)

ఉగ్రవాదాన్ని పెంచిపోషించిన పాకిస్థాన్ పర్యవసానాలను ఎదుర్కోక తప్పదని భారత్ మరోసారి స్పష్టంచేసింది. భారత్‌తో పాటు ప్రపంచ దేశాల్లోని అమాయకులను ఈ ఉగ్రవాదులు బలితీసుకున్నారని పేర్కొంది. సీమాంతర ఉగ్రవాదానికి పాక్ మద్దతు నిలిపివేసే వరకు సింధూ జలాల ఒప్పందం నిలిపివేత కొనసాగుతుందని పేర్కొంది. ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాలపై విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ మీడియా సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఇక పాక్ ఆక్రమిత కశ్మీర్ పరిష్కారానికి ద్వైపాక్షిక చర్చలే మార్గమని భారత్ పునరుద్ఘాటించింది. జమ్మూ కశ్మీర్ విషయంలో భారత్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని తెలిపింది. ద్వైపాక్షిక చర్చలు తప్ప ఎలాంటి మధ్యవర్తిత్వాన్ని భారత్ అంగీకరించదని స్పష్టం చేసింది. పీవోకేను పాక్ ఖాళీ చేసే అంశం మాత్రమే మిగిలి ఉందని వెల్లడించింది. "కాల్పుల విరమణపై మా వైఖరి సుస్పష్టం. ప్రపంచ దేశాల నుంచి సంప్రదింపులు జరిపిన వారితోనూ ఇదే విషయాన్ని చెప్పాం. ఉగ్రవాదులను అణచివేయడమే భారత్ ప్రాథమిక లక్ష్యం. ఉగ్రస్థావరాలపై భారత్ దాడి చేసింది. ప్రతిగా పాక్ దుస్సాహసానికి దిగింది. ప్రతిచర్యగానే భారత్ దాడులు చేసింది. వాళ్లు కాల్పులు నిలిపివేస్తే భారత్ దాడులు ఆపేస్తుంది.

మిగతా 2లో..

## సిబిల్ స్కోర్‌తో రాజీవ్ యువ వికాసం స్కీమ్‌కు సంబంధం లేదు: డిప్యూటీ సీఎం భట్టి



- స్వయం ఉపాధికి రాజీవ్ యువ వికాసం స్కీమ్
- సిబిల్ స్కోర్‌పై యువతలో ఆందోళన
- సిబిల్ స్కోర్‌తో సంబంధం లేదన్న డిప్యూటీ సీఎం స్పష్టం
- జూన్ 2న మంజూరు లెటర్లు పంపిణీ
- బీఆర్ఎస్ పాలనపై విమర్శలు
- రాజీవ్ యువ వికాసం – యువతకు ఒక వరం
- నీటి అవసరాల కోసం ప్రత్యేక కృషి

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం స్కీమ్‌ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అయితే.. సిబిల్ స్కోర్ ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారని ప్రచారం జరగడంతో యువతలో ఆందోళన నెలకొంది. గ్రామ యువతకు సిబిల్ స్కోర్‌పై పెద్దగా అవగాహన ఉండదని.. స్కీమ్ గైడ్ లైన్స్‌లో ఈ అంశాన్ని చేర్చొద్దని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో రాజీవ్ యువ వికాసం స్కీముపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క క్లారిటీ ఇచ్చారు. సిబిల్ స్కోర్‌తో రాజీవ్ వికాసం స్కీమ్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. అవగాహన లేని కొన్ని సోషల్ మీడియా, ఇతర సంస్థలు సిబిల్ స్కోర్ విషయంలో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని అన్నారు. ఈ స్కీమ్‌కు సంబంధించి మండల స్థాయిలో ప్రాసెస్‌ను ప్రారంభమైందని.. జూన్ రెండవ తేదీ కల్లా లబ్ధిదారులకు మంజూరు లెటర్లు అందజేస్తామన్నారు.

మిగతా 2లో..

## పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యమే లక్ష్యం



- సనత్‌నగర్‌లో టిమ్స్ ఆస్పత్రి నిర్మాణ పనుల పరిశీలన
- రూపాయి లేకున్నా అత్యాధునిక చికిత్స అందేలా టిమ్స్ నిర్మాణం వేగవంతం
- మెఘా సంస్థకు మంత్రి సూచనలు, హెచ్చరికలు
- ఎమర్జెన్సీ పికప్ & డ్రాప్ పాయింట్స్ విస్తృతంగా, వెయిటింగ్లే
- కుండా అడ్వాన్స్డ్ మానిటరింగ్ వ్యవస్థ ఏర్పాటు
- వైద్య పరికరాల ఏర్పాటుకు సమన్వయ సమావేశాలు
- పేషెంట్లకు మానసిక ఆనందం కలిగించేందుకు పచ్చదనం ఏర్పాట్లు.
- అధునాతన ధర్మశాల నిర్మాణం, అక్షయపాత్రతో ఒప్పందం ద్వారా ₹5కే భోజనం
- హాస్టల్ బిల్డింగ్, ఫార్మసీ, ఓపీడీ, రేడియోలజీ, ఎమ్ఆర్ఐ, సిటీ స్కాన్ రూం – పేషెంట్లకు అనుకూలంగా నిర్మాణం.
- అల్వాల్, ఎల్.బీ నగర్ టిమ్స్ నిర్మాణాలకు ప్రోత్సాహం – ఉస్మానియా నయా దవాఖాన నిర్మాణం ప్రారంభం.

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్, (ఎర్రగడ్డ)లోని 53 ఎకరాల ప్రాంగణంలో 11.43 ఎకరాలలో ప్రముఖ నిర్మాణ సంస్థ మెఘా (మెయిల్) నిర్మిస్తున్న ప్రభుత్వ టిమ్స్ హాస్పిటల్ నిర్మాణ పనులను మంగళవారం రాష్ట్ర రోడ్లు భవనాలు & సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పరిశీలించారు. మంత్రి తో పాటు స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజు హాజయ్యారు. పరిశీలించిన అనంతరం మంత్రి కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. వచ్చే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సనత్ నగర్ (ఎర్రగడ్డ) టిమ్స్ హాస్పిటల్‌ను ప్రారంభించేందుకు శరవేగంగా పనులు చేస్తున్నట్లు తెలిపారు. పేద ప్రజలు రూపాయి లేకున్నా కార్పొరేట్ను మించిన వైద్యం అందుకునేలా టిమ్స్ ఆస్పత్రిని మలుస్తామని చెప్పారు. మేం స్కీంలను అమలు చేస్తూ ప్రజలకు చేరువవుతుంటే - బీఆర్ఎస్ పార్టీ స్కాంలు చేస్తూ ప్రజల్లో అబాసుపాలవుతుందని ఆయన ఎద్దేవా చేశారు. విదేశాల్లో నాణ్యమైన ఉచిత విద్యా, వైద్యం అందించినట్టే తెలంగాణలోనూ అమలు చేసేలా ప్రణాళికలు రచిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పాక్‌కు దిమ్మదిరిగేలా బుద్ధి చెప్పారు..

(మొదటి పేజీ తరువాయి)

ఆపరేషన్ సిందూర్ విజయంపై జాతినుద్దేశించి ప్రసంగించిన మరుసటి రోజే మోదీ ఎయిర్‌ఫోర్స్‌నుద్దేశిస్తూ మాట్లాడటం గమనార్హం. త్రిశూలం చిహ్నంతో ఉన్న ఎయిర్ కమాండ్ క్యాప్ ధరించి భారత్ మాతా కీ జై అంటూ ప్రధాని ప్రసంగం ప్రారంభించారు. "పాక్ గడ్డపై మీరు చేసిన యుద్ధం అనుపమానం. అపూర్వం. అసాధారణం. అద్భుతం. పాకిస్తాన్ నడిబొడ్డున బాంబులు పేల్చారు. కేవలం 20-25 నిమిషాల్లో లక్ష్యాలను నేలమట్టంచేశారు. మీ మెరుపువేగం, కచ్చితత్వం శత్రువులను నిశ్చేష్టులను చేసింది. చూసుకునేలోపే ఛాతీని చీల్చేశాం. మీ పోరాటంతో ప్రతి ఒక్క భారతీయుడు గౌరవంతో ఉప్పొంగిపోయాడు. మేం మీకు రుణపడిపోయాం. ఇది ఎన్నటికీ తీర్చుకోలేని రుణం. ఊహకందనంతటి శక్తియుక్తుల్ని ప్రదర్శించి దేశానికి విజయం చేకూర్చిన మీ నుంచి ఆశీస్సులు తీసుకోవడానికే నేను వచ్చా.

ఆపరేషన్ సిందూర్ ధాటికి ఇక లక్ష్మణరేఖ దాటొద్దని పాకిస్తాన్‌కు బాగా అర్థమైంది. తరచూ అణుబాంబులతో బెదిరించాలని చూస్తున్న దాయాదికి మన బలగాలు భారత్ మాతాకీ జై నినాదంలోని అపారశక్తిని బయటకు తీసి చూపారు. భారత్ మాతాకీ జై అనేది కేవలం నినాదం కాదు. దేశం కోసం తమ ప్రాణాలనైనా పణంగా పెడతామని బలగాలు చేసిన ప్రతిజ్ఞ. మన డ్రోన్లు, క్షిపణుల మోత పాక్ గడ్డపై ప్రతిధ్వనించిన ప్రతిసారీ పాకిస్తాన్ సైనికుల చెవుల్లో భారత్ మాతాకీ జై అనే నినాదమే మార్మోగింది. వాయుసేన శౌర్యం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. మన సైనిక, వాయు, నావికా దళాలకు నా సెల్యూట్" అంటూ మోదీ సెల్యూట్ చేశారు.

"భారత గడ్డపై కన్నేస్తే తాము కనుమరుగు అవడం ఖాయమని ఉగ్రపోషకులకు ఆపరేషన్ సిందూర్ తర్వాత బాగా గుర్తుంటుంది. మీ పరాక్రమంతో ఆపరేషన్ సిందూరం నినాదం ప్రపంచమంతా మార్మోగుతోంది. శత్రువులు ఈ ఎయిర్‌ఫోర్స్‌ను నాశనం చేద్దామని కంకణం కట్టుకుని ఎడాపెడా దాడులు చేశారు. వాళ్ల ప్రయత్నాలను మీరు సులభంగా వమ్ముచేశారు. మన వైమానిక స్థావరాలు, రక్షణ మౌలిక సదుపాయాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో వాళ్ల 9 కీలక ఉగ్రస్థావరాలను సమాధులుగా మార్చేశాం. 100 మందికిపైగా ముష్కరులను మట్టుపెట్టాం. పాక్‌కు చెందిన ఎనిమిది సైనిక స్థావరాలను నాశనం చేశాం. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా భారత్ గీసిన లక్ష్మణరేఖ ఇప్పుడు మరింత స్పష్టంగా కనిపిస్తోంది" అని అన్నారు.

"ధర్మ సంస్థాపనే లక్ష్యంగా శత్రు సంహారం కోసం ఆయుధం చేతబట్టి యుద్ధంచేయడం భారతీయుల సంప్రదాయం. మన అక్కచెల్లెళ్ల, కుమార్తెల పసుపు కుంకుమలు, సిందూరాన్ని తుచ్ఛమైన ముష్కరులు తుడిచేయగానే మనం వాళ్ల నట్టింట్లోకి వెళ్లి మరీ నాశనం చేశాం. కనీసం పారిపోయే అవకాశం కూడా ఇవ్వలేదు. పహల్గాంలో వాళ్లు దొంగదెబ్బ తీస్తే మనం మాత్రం నేరుగా వెళ్లి, ఎదురునిలిచి పోరాడాం. పాకిస్తాన్ సైన్యం చంకనెక్కి భద్రంగా ఉండొచ్చని ఇన్నాళ్లు ఉగ్రవాదులు భావించారు. కానీ మన బలగాలు ఇక పాక్‌లో ఉగ్రవాదానికి సురక్షిత స్థలమంటూ ఏదీ లేదని నిరూపించాయి.

సూర్యోదయం వేళ మీ సుందర దర్శనం చేసుకునేందుకే నేను ఇక్కడికొచ్చా. మీరు ఈ తరానికే కాదు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాతలు. మరోసారి సాహసిస్తే నాశనం, వినాశనం అని శత్రువులకు సందేశం ఇచ్చారు. భారత్ మాతాకీ జై అన్నప్పుడల్లా భయంతో శత్రువుల గుండెలు జారిపోయాయి. పరాక్రమవంతుల అడుగులతో నేల కూడా పులకిస్తుంది. అంతటి ధైర్యవంతులను నేరుగా చూడటంతో జన్మ ధన్యమవుతుంది. ఆ భాగ్యం కోసమే నేను ఇక్కడికొచ్చా. వీరుల నేలపై నిలబడి ఇప్పుడు నేను ఎయిర్‌ఫోర్స్, నేవీ, ఆర్మీ, బీఎస్ఎఫ్‌లోని యోధులకు సలామ్ చేస్తున్నా. మీ వీరత్వంతో ఆపరేషన్ సిందూర్ నినాదం నేల నలుచెరుగులా ప్రతిధ్వనిస్తోంది" అంటూ బలగాలను మోదీ పొగిడారు.

"ఇప్పుడు భారత్ మూడే సూత్రాలతో ముందుకెళ్తోంది. ఒకటి.. ఉగ్రదాడి జరిగితే మనదైన శైలిలో సమయం చూసి దీటుగా బదులిస్తాం. రెండు.. అణుబాంబులకు భయపడేదే లేదు. మూడు.. ఉగ్రవాదాన్ని పెంచిపోశించే వాళ్లను, ఉగ్రవాదాన్ని జాతీయవాదంగా మార్చేసిన ప్రభుత్వాలను ఇకపై భారత్ వేర్వేరుగా చూడబోదు" అని మోదీ స్పష్టంచేశారు. ఆదంపూర్ ఎయిర్‌బేస్ అనేది దేశంలోని రెండో అతిపెద్ద వైమానిక స్థావరం. ఇక్కడ అత్యంత అధునాతన రఫేల్, మిగ్-29 యుద్ధవిమానాల స్క్వాడ్రన్ దళాలు ఉంటాయి. 1965, 1971 యుద్ధాల్లోనూ ఆదంపూర్ వైమానిక స్థావరం అత్యంత కీలకపాత్ర పోషించింది.

"వాయుసేన ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణుల వేగం, సత్తా చూసి పాకిస్తాన్ నిద్రలేని రాత్రులు గడిపింది. సమరంలో నేరుగా పోరాడే దమ్ములేక వైమానికస్థావరంలో పౌరవిమానాలను ముందు నిలిపి పాక్ తన వక్రబుద్ధిని ప్రదర్శించింది. అయినాసరే మన వాయుసేన అత్యంత కచ్చితత్వంతో పాక్ సాయుధ సంపత్తి, వైమానిక స్థావరాలనే గురిచూసి కొట్టింది. అమాయక పౌరులకు ఏ హానీ తలపెట్టలేదు. ఒక్క పౌరవిమానాన్నీ మీరు ధ్వంసంచేయలేదు. ఈ విషయంలో నేను నిజంగా గర్వపడుతున్నా. దాడుల్లో మీరు శత్రు స్థావరాలు, ఉగ్రశిబిరాలనే కాదు మరోసారి దుస్సాహసం చేయాలనే దుర్బుద్ధినీ దెబ్బతీశారు.

గగనతల, భూతల యుద్ధ వ్యవస్థల మధ్య అద్భుతమైన సమన్వయం సాధించారు. మానవ యుక్తిని మెషీన్ శక్తిని చక్కగా మేళవించారు. మీరు భారత్ మాతా కీ జై అన్న ప్రతిసారీ శత్రువుల వెన్నులో వణుకుపుట్టింది. మీ సారథ్యంలో దేశీయ తయారీ ఆకాశ్ మిస్సైళ్లు, అధునాతన సుదర్శన చక్ర(ఎస్-400) వ్యవస్థలు శత్రు దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టాయి. ఆపరేషన్ సిందూర్ ద్వారా మీరు దేశ ఆత్మవిశ్వాసం, సమైక్యత, ప్రతిష్టను నూతన శిఖరాలపై నిలిపారు. అణుబూచికి ఏమాత్రం భారత బలగాలు బెదరవని నిరూపించారు. మన శక్తియుక్తుల ముందు పాకిస్తాన్ అన్ని డ్రోన్లు, యూఏవీలు, క్షిపణులన్నీ దిగదుడుపే. నమ్మశక్యంకాని రీతిలో రణతంత్రం ప్రదర్శించారు.

గత దశాబ్దకాలంలో అత్యంత అధునాతన సమర సాంకేతికతలన్నింటినీ మన బలగాలు అందిపుచ్చుకున్నాయి. టెక్నాలజీ వాడకంలో, యుద్ధం వచ్చినప్పుడు ఎలా వినియోగించుకోవాలో మీకు బాగా తెలుసు. రియల్ గేమ్‌లో మీరు అదరగొట్టారు. మీరు ఆయుధాలతో మాత్రమే యుద్ధం చేయలేదు. భారత్ ఇప్పుడు డ్రోన్లు, డేటా, టెక్నాలజీ సహిత రణాల్లో రాటుదేలింది. మీరు దమ్ము చూపించి శత్రువులను దుమ్ములో కలిపేశారు" అని మోదీ అన్నారు. మహారాణా ప్రతాప్ అశ్వమైన చేతక్ చూపిన తెగువ, సాహసం ఇప్పుడు మన ఆధునిక యుద్ధవిమానాలకు పాటవానికి సరిగ్గా సరిపోతుంది అంటూ నాటి వచనాలను మోదీ గుర్తుచేశారు. "కదలికల్లో నైపుణ్యం కనబరిచాయి. మెరుపువేగంతో దూకుడు చూపాయి. శత్రుసైన్యం మధ్యల్లోంచే శస్త్రాలు సంధించాయి" అని మోదీ ఆ వచనాలను వల్లెవేశారు.



"ఇది నవయుగ భారతం. దేశం శాంతినే కోరుకుంటుంది. శాంతంగా ఉంటాం. శాంతిమయ మానవత్వంపై దాడి చేస్తే ఊరుకోం. యుద్ధ క్షేత్రంలో శత్రువును ఎలా అణగదొక్కాలో భారత్‌కు బాగా తెలుసు. శాంతంగా ఉంటాం. అవసరమైనప్పుడు సమరమూ చేస్తాం. ఆపరేషన్ సిందూర్ అంటే పోరాటానికి పెట్టుకున్న పేరు కాదు. భారత విధాననిర్ణయ పతాక. దృఢ సంకల్పానికి, శక్తిసామర్థ్యాలకు ప్రతీక. శాంతిమయ జీవనం సాగించాలని ప్రపంచానికి బోధించిన బుద్ధుని నేల మాత్రమేకాదు శత్రువులను చీల్చి చెండాడిన గురు గోవింద్ సింగ్ లాంటి వీరపరాక్రముల పవిత్రభూమి" అని అన్నారు.

## ఉగ్రవాదాన్ని ప్రోత్సహించిన పాకిస్తాన్ పరిణామాలను ఎదుర్కోక తప్పదు: భారత్ ఘాటు హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

ఇదే విషయాన్ని ప్రపంచదేశాలకు చెప్పాం. మేము చెప్పిన విషయాన్ని ప్రపంచ దేశాల నాయకులు పాక్‌కు చెప్పి ఉంటారు. భారత్ చెప్పిన విషయాన్ని పాక్ పెడచెవిన పెట్టింది" అని రణ్‌ధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ తాను మధ్యవర్తిత్వం వహించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వాదనను భారత్ మరోసారి తోసిపుచ్చింది. "ఆపరేషన్ సిందూర్ మొదలైనప్పటి నుంచి 10వరకు జరిగిన సైనిక చర్యలపై భారత్‌అమెరికా మధ్య చర్చలు జరిగాయి. యుద్ధ వాతావరణంలోనే చర్చలు జరిగాయి తప్ప వాణిజ్య అంశాలు ప్రస్తావనకు రాలేదు. ద్వైపాక్షిక చర్చలు తప్ప ఎలాంటి మధ్యవర్తిత్వాన్ని భారత్ అంగీకరించదు" అని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు.

కాల్పుల విరమణకు సంబంధించి ఇరు దేశాల మధ్య డీజీఎంవోల స్థాయిలోనే చర్చలు జరిగాయని, వీటి వివరాలను ఇప్పటికే తెలియజేశామని విదేశాంగశాఖ వెల్లడించింది. పాకిస్థాన్ హైకమిషన్ నుంచి ఆ రోజు మధ్యాహ్నం 12.37గంటలకు భారత విదేశాంగశాఖకు ఫోన్ వచ్చిందని తెలిపింది. అయితే, తొలుత సాంకేతిక కారణాల వల్ల పాకిస్థాన్ హాట్‌లైన్‌లో కనెక్ట్ కావడంలో ఇబ్బందులు పడిందని, తర్వాత మధ్యాహ్నం 3.25గంటలకు భారత డీజీఎంవోతో చర్చలు జరిగాయని పేర్కొంది. కాల్పుల విరమణకు ఎవరు ఎవరికి ఫోన్ చేశారనేది ప్రపంచం గుర్తించిందని భారత విదేశాంగశాఖ వెల్లడించింది.



## పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

సనత్ నగర్ (ఎర్రగడ్డ) టిమ్స్ హాస్పిటల్ నిర్మాణంలో ఆర్ & బీ, వైద్యశాఖ సమన్వయం చేసుకునేలా నోడల్ ఆఫీసర్ ను నియమిస్తామని, వచ్చే రెండు మూడు రోజుల్లో రెండు శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యచరణపై రూట్ మ్యాప్ ను రూపొందిస్తామని వివరించారు. ఈ టిమ్స్ హాస్పిటల్ నిర్మాణం, మనం సొంతిళ్లు నిర్మించుకునే విధంగా కార్పొరేట్ స్థాయిలో నిర్మించాలని దేశవ్యాప్తంగా ఎన్నో కట్టడాలను కడుతున్న మేఘా సంస్థ టిమ్స్ హాస్పిటల్ నిర్మాణాన్ని ఒక దైవకార్యంల భావించాలని మేఘా ఇంజనీరింగ్ సంస్థ సిబ్బందికి మంత్రి సూచించారు.

ఇక ఎలక్ట్రిసిటీ సిస్టమ్, ఆక్సిజన్ పైపింగ్ సిస్టమ్, వాటర్ అండ్ డ్రైనేజీ సిస్టమ్స్ ఎక్కడా లోపాలు లేకుండా నిర్మించాలని, ఒక్కసారి పేషెంట్లు జాయిన్ అయ్యాక లీకేజీలు వస్తే నిర్మించిన సంస్థ రెప్యుటేషన్ దెబ్బతింటుందని కాంట్రాక్టర్ లు డబ్బులు కోసం కాకుండా, పేరు కోసం నిర్మాణ పనులు చేయాలని మేఘా నిర్మాణ సంస్థను మంత్రి హెచ్చరించారు. హాస్పిటల్‌లో పేషెంట్ల ప్రాణాలను నిలబెట్టే ప్రధానమైన ఎమర్జెన్సీ పికప్, డ్రాప్ పాయింట్స్ మరింత విశాలంగా ఉండేలా నిర్మించాలని అధికారులకు మంత్రి సూచించారు. ఎమర్జెన్సీ వార్డులో పెషెంట్లు వెయిటింగ్ లేకుండా ఉండేలా అడ్వాన్స్డ్ మానిటరింగ్ సిస్టం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపిన మంత్రి.. గోల్డెన్ అవర్ లో పేషెంట్‌కు తగిన చికిత్స అందితే ప్రాణాలు రక్షించినట్టే తెలిపారు.

రెండు మూడు రోజుల్లో మెడికల్ ఎక్విప్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటు, వైద్య పరికరాల కూర్పుపై వైద్యశాఖ అధికారులతో ఆర్ అండ్ బీ ఇంజనీర్ల సమావేశమవుతారని మంత్రి తెలిపారు.. బ్లాక్‌ఏ ఇప్పటికే స్లాబ్ వర్క్ పూర్తయ్యిందని టైలింగ్, సీలింగ్, ప్లాస్టరింగ్ వర్కులు నడుస్తున్నాయని.. బ్లాక్ - బీ 5వ అంతస్తు స్లాబ్ పడితే పూర్తవుతుంది. బ్లాక్ - సీ పనులు చివరి దశలో ఉన్నట్టు తెలిపారు. హాస్పిటల్ వచ్చే రోగుల్లో మానసిక ఆనందాన్ని కలిగించేందుకు పచ్చని గ్రాస్ గార్డెన్ తో పాటు రంగు రంగుల పూల మొక్కలు నాటాలని సూచించారు. పేషెంట్ల అటెండెంట్లు ఉండేందుకు అధునాతన సౌకర్యాలతో ధర్మశాల నిర్మించడంతో పాటు.. అక్షయపాత్ర సంస్థతో ఒప్పందం చేసుకున్నామని, వారికి ఐదు రూపాయలకే నాణ్యమైన భోజన వసతి కల్పిస్తామని చెప్పారు. అధునాతన హాస్టల్ బిల్డింగ్ నిర్మాణంలో ఉందని, ఫార్మసీ రూం, ఓపీడీ రిజిస్ట్రేషన్ రూంలను కంప్యూటరించి పేషెంట్లకు వేగంగా అపాయింట్మెంట్ దొరికేలా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రేడియోలజీ, ఎమర్జెన్సీ వార్డులు, ఎమ్ఆర్ఐ, సిటీ స్కాన్ రూంలను పేషెంట్లకు అనువుగా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు.

ఇదే కాకుండా, అల్వాల్ టిమ్స్ కు స్థల ఇబ్బందులు ఉంటే ఎన్ఓసీ ఇప్పించానని, ఎల్.బీ నగర్ టిమ్స్ నిర్మాణాన్ని వేగవంతం చేస్తామని వివరించారు. ఇక వచ్చే రెండు, మూడు నెలల్లో గోషామహల్ స్టేడియంలో ఉస్మానియ నయా దవాఖాన నిర్మాణం చేపడుతున్నామని, నిమ్స్ దవాఖాన ను వీలైనంత త్వరగా అందుబాటులోకి తెచ్చేలా పనులను స్పీడప్ చేసినట్లు మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, సనత్ నగర్ కంటేస్టేడ్ ఎమ్మెల్యే కోటా నీలిమ, సీఈ రాజేశ్వర్ రెడ్డి, ఎలక్ట్రిసిటీ విభాగం సీఈ లింగారెడ్డి, ఎస్ఈ విశ్వ కుమార్, ప్రాజెక్టు ఇన్చార్జి స్వామి నాయుడు, నూకరాజు, కె.గోవర్ధన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, విజయ్ విశ్వ కుమార్, దుర్గాప్రసాద్, సంతోషిణి, ఎలక్ట్రికల్ సి జిఎం కృష్ణారెడ్డి, ఈఈలు, మేఘా ఇంజనీరింగ్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్‌ఆర్‌ఎస్ గడువు పొడగింపు

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

అక్రమ లేఅవుట్లను 25% రాయితీతో క్రమబద్ధీకరణ చేసుకునేందుకు గడువును తెలంగాణ ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు పొడిగించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసింది. అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు 2020లోనే అప్పటి సర్కారు ఎల్ఆర్ఎస్ పథకాన్ని ప్రకటించింది. అయితే వివిధ కారణాలతో దీనికి ఆశించిన ఫలితం రాలేదు. అధికారులు ఐదేళ్ల కాలంలో కేవలం 9 లక్షల దరఖాస్తులను మాత్రమే పరిష్కరించగలిగారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని దరఖాస్తుదారులకు క్రమబద్ధీకరణకు 25% రాయితీని ఇస్తూ ఈ ఏడాది ఫిబ్రవరిలో రాష్ట్ర ప్రభుత్వం వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకం(ఓటీఎస్)ను ప్రకటించింది. దీని గడువు తేదీ మార్చి 31తో ముగిసిపోగా దాన్ని ఏప్రిల్ 30 తేదీ వరకు పొడిగించింది. ఈ సమయం కూడా ముగిసిన తర్వాత తొలుత ఈ నెల 3వ తేదీ వరకు అవకాశంకల్పించింది. ఇప్పుడు దీన్ని ఈ నెల 31 తేదీ వరకు పొడిగిస్తున్నట్లుగా తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రజల నుంచి వస్తున్న వినతులను దృష్టిలో పెట్టుకొని ఈ గడువును పెంచినట్లుగా అందులో వెల్లడించింది. అక్రమ లే అవుట్ల క్రమబద్ధీకరణ కోసం తెలంగాణ ప్రభుత్వం ఎల్ ఆర్ఎస్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే రాష్ట్రంలో అనధికార స్థలాల క్రమబద్ధీకరణను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం 25శాతం రాయితీతో ఒటీఎస్ (వన్ టైమ్ సెటిల్‌మెంట్)ను ప్రకటించింది.




## ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు శ్రవణ్ రావు అరెస్ట్

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న శ్రవణ్ కుమార్ రావును సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. కర్ణాటక రాష్ట్రం నుంచి ముడి ఇనుము సరఫరా చేస్తానంటూ నగదు తీసుకొని మోసగించినట్టు హైదరాబాద్ నగరానికి చెందిన అఖండ్ ఇన్ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ ఆకర్ష్ క్రిష్ణ ఇచ్చిన ఫిర్యాదు చేశారు. దీనిపై గత నెల 24న శ్రవణ్ రావుపై కేసు నమోదైంది. కేసు దర్యాప్తు చేస్తున్న సీసీఎస్ పోలీసులు అతనికి నోటీసులు ఇచ్చి విచారించారు. విచారణ అనంతరం అతన్ని అరెస్ట్ చేసి న్యాయమూర్తి నివాసానికి తరలించారు. బంజారా హిల్స్ మిథిలానగర్ కాలనీలోని అఖండ్ సంస్థ 2008 నుంచి వ్యాపారం నిర్వహిస్తోంది. 2022 జూన్‌లో ఆ సంస్థ కార్యాలయానికి శ్రవణ్ కుమార్ రావు వచ్చి ఇన్ రిథమ్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్‌గా పరిచయం చేసుకున్నాడు. కర్ణాటక సండూర్‌లోని ఎకోర్ ఇండస్ట్రీస్ కంపెనీ ప్రతినిధిగా చెప్పాడు. ఎకోర్ నుంచి ముడి ఇనుమును సరఫరా చేస్తానని ఇందుకు టన్నుకు 300 లాభం వస్తుందని తెలిపాడు. దీంతో ఎకోర్ ఇండస్ట్రీస్ బ్యాంకు ఖాతాకు 2022 నవంబరు నుంచి 2023 డిసెంబరు వరకు విడతల వారీగా రూ.కోట్లలో అఖండ్ సంస్థ నగదును పంపింది. కంపెనీలకు ముడి ఇనుము సరఫరా చేస్తున్నట్టు వేర్వేరు పేర్లతో రశీదులు సృష్టించాడు. దానిలో టన్నుకు రూ.300 లాభం వచ్చినట్లు ఇన్వాయిస్‌లను రూపొందించాడు. తమ కంపెనీ పేరుతో ఇన్వాయిస్‌లు లేకపోవటంతో అనుమానించి అఖండ్ సంస్థ ఆరా తీయగా రూ.6.58 కోట్లు తమకు నష్టం కలిగించినట్టు గుర్తించారు. దీనిపై సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారించి అరెస్ట్ చేశారు. గాంధీ అస్పత్రిలో వైద్య పరీక్షల అనంతరం నాంపల్లి కోర్టు న్యాయమూర్తి ఇంటికి తరలించారు.

## సిబిల్ స్కోర్‌తో రాజీవ్ యువ వికాసం స్కీమ్‌కు సంబంధం లేదు: డిప్యూటీ సీఎం భట్టి

(మొదటి పేజీ తరువాయి)

నిరుద్యోగ యువత తలెత్తుకొని బతికేందుకు రాజీవ్ యువ వికాస పథకాన్ని తీసుకొచ్చామని చెప్పారు. మంగళవారం (మే 13) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు నియోజకవర్గంలోని బయ్యారం, టేకులపల్లి మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు భట్టి శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం లాంటి స్కీమ్ భారత దేశంలోనే ఎక్కడ లేదని అన్నారు. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువకులు వాళ్ల కాళ్ళ మీద వాళ్ళు నిలబడేందుకు స్వయం ఉపాధి అవకాశాన్ని ఎంచుకొని ఎదగడానికి రాజీవ్ యువ వికాసం స్కీమ్ ఒక వరం లాంటిదన్నారు. పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఎలాంటి భృతిని, ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని మండిపడ్డారు. గత పది సంవత్సరాలు తెలంగాణ యువత నిరాశ నిస్పృహల్లో బతికిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 52,000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని పేర్కొన్నారు. మిగిలిన ఉద్యోగాల భర్తీకి కోసం జాబ్ క్యాలెండర్ ప్రకటించామని గుర్తు చేశారు. ఇల్లందు నియోజకవర్గంలోని తులారం ప్రాజెక్ట్, బయ్యారం పెద్ద చెరువు మరమ్మత్తులతో పాటు ఇల్లందు ప్రాంతంలో సర్వే చేసి నివేదికను తయారుచేసి సీతారామ ప్రాజెక్టు ద్వారా నీళ్లందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక








# చార్మినార్ వద్ద సుందరీమణుల హెరిటేజ్ వాక్





(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

నిజాం వారసత్వ వైభవానికి, ఇప్పటికీ సాంస్కృతిక వైవిధ్యానికి ప్రతీకగా నిలుస్తున్న హైదరాబాద్ పాతబస్తీలోని చార్మినార్ వద్ద వివిధ దేశాల సుందరీమణులు సందడి చేశారు. చార్మినార్‌ను ఆసక్తిగా తిలకించారు. ఫొటోలకు పోజులిచ్చారు. మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ హెరిటేజ్ వాక్ ఉత్సాహంగా సాగింది.

చార్మినార్ వద్ద, లాడ్‌బజార్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెడ్ కార్పెట్‌పై అందాల భామలు వయ్యారంగా నడుస్తూ స్థానికులను అలరించారు. వీరికి పాతబస్తీలో పాపులర్ అయిన అరబ్బీ మార్ఫా వాయిద్యాలతో స్వాగతం పలకగా..కొందరు మార్ఫా వాయిద్యాల సంగీతానికి అనుగుణంగా స్టెప్పులేశారు. అనంతరం లాడ్ బజార్‌కు వెళ్లారు. చుడీ బజార్ (గాజుల మార్కెట్)లో షాపింగ్ చేశారు.

ప్రపంచ సుందరి పోటీల నేపథ్యంలో నగరానికి చేరుకున్న దాదాపు 109 దేశాలకు చెందిన మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. కాగా మంగళవారం ప్రభుత్వం హెరిటేజ్ వాక్‌లో భాగంగా వారు చార్మినార్‌ను సందర్శించారు. విశిష్టమైన నగర వారసత్వ వైభవానికి ఈ అందాల ముద్దుగుమ్మలు ఫిదా అయిపోయారు. చార్మినార్‌ను తిలకించడమే కాకుండా దాని ముందు ఏర్పాటు చేసిన వేదికపై గ్రూప్ ఫోటో దిగారు. చార్మినార్ చరిత్ర, గొప్పదనం గురించి టూరిజం శాఖ గైడ్‌లను అడిగి తెలుసుకున్నారు. కొందరు తమ ఫోన్‌లలో చార్మినార్ అందాలను బంధించారు.

### గాజులు, ముత్యాల హారాల షాపింగ్

నగర జీవనశైలి, ఇక్కడి విభిన్న సంస్కృతుల సమ్మేళనాన్ని ప్రపంచ సుందరీమణులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో చార్మినార్ సమీపంలోని లాడ్ బజారులో ఎంపిక చేసిన తొమ్మిది దుకాణాల్లో హెరిటేజ్ వాక్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ బ్యాంగిల్స్, ముజీబ్ బ్యాంగిల్స్, కనహయ్యలాల్, మోతీలాల్ కర్వా, గోకుల్ దాస్ జరీవాల, కేఆర్ కాసత్, జాజు పెరల్స్, ఏ హెచ్ జరీవాల, అఫ్జల్ మియా కర్చోబే వాలే దుకాణాల్లో ఈ మిస్ వరల్డ్ తారలు అందమైన గాజులు, ముత్యాల హారాలు తదితర అలంకరణ వస్తువులు తీసుకున్నారు.

నగర విశిష్టతను చాటాలన్న వ్యాపారులు లాడ్ బజార్ వ్యాపారులు కొందరు సుందరీమణుల వద్ద డబ్బులు తీసుకోవడానికి నిరాకరించారు. మీమీ దేశాల్లో హైదరాబాద్ విశిష్టతను, చార్మినార్ లాడ్ బజార్ ప్రత్యేకతను చాటాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా లాడ్ బజార్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రిక్షాలు, రంగురంగుల అలంకరణలు ఆకట్టుకున్నాయి. సుందరీమణుల హెరిటేజ్ వాక్ సందర్భంగా పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసింది.

# మీ సేవలు అందించండి అమెరికా ఒత్తిడితోనే




అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సన్నిహితుడైన ఎలన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ కంపెనీ త్వరలో మన దేశంలో కార్యకలాపాలు ప్రారంభించబోతోంది. స్టార్‌లింక్‌కు ఆహ్వానం పలుకుతూ కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ నుండి ఓ లేఖ పంపారు. భారత ప్రభుత్వ నూతన జాతీయ భద్రతా మార్గదర్శకాలను పాటించేందుకు స్టార్‌లింక్ అంగీకరించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. స్టార్‌లింక్ ప్రవేశాన్ని అనుమతించాల్సిందిగా సుంకాలు విధించిన కొన్ని దేశాలపై అమెరికా ఒత్తిడి చేసిందని విదేశాంగ శాఖ వర్గాలను ఉటంకిస్తూ వాషింగ్టన్ పోస్ట్ పత్రిక తెలియజేసింది. స్టార్‌లింక్ దరఖాస్తు కొంతకాలంగా పరిశీలనలో ఉన్నదని అధికార వర్గాలు చెబుతున్నాయి. గత వారం సవరించిన భద్రతా నిబంధనలు విడుదలైన తర్వాత వాటికి ఆ కంపెనీ అంగీకరించడంతో వెంటనే అనుమతులు లభించాయి. ఉపగ్రహ ఇంటర్నెట్ ప్రొవైడర్ల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన భద్రతా నిబంధనల ప్రకారం%ొ% వారు తమ వద్ద ఉన్న సమాచారాన్ని భారత సరిహద్దుల లోపలే ఉంచుకోవాలి. బయటకు పంపకూడదు. విదేశీ టర్మినల్స్ లేదా ఫెసిలిటీలకు యూజర్ కనెక్షన్లను అనుసంధానం చేయడాన్ని నిషేధించారు. సంప్రదింపుల సమయంలో స్టార్‌లింక్ రెండు అంశాలపై అయిష్టత వ్యక్తం చేసింది. అంతర్జాతీయ సరిహద్దుల వద్ద టెర్మినల్స్‌ను పర్యవేక్షించడం, శాట్‌కామ్ కంపెనీలలో భారతీయులకు మెజారిటీ వాటాలు ఇవ్వడం%ొ% ఈ రెండు నిబంధనలను స్టార్‌లింక్ ఇష్టపడలేదు. దీంతో ఆ రెండిరటినీ ప్రభుత్వం తొలగించిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

# కెనరా బ్యాంక్ ఉద్యోగులు భళా..





ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ ఉద్యోగులు డిపాజిట్ల సమీకరణలో భళా అనిపించుకున్నారు. డిపాజిట్ల వృద్ధి లేమితో సతమతమవుతున్న కెనరా బ్యాంకు చేపట్టిన వినూత్న కార్యక్రమంలో భాగంగా కేవలం 10 వారాల్లోనే రూ.16,700 కోట్లు సమీకరించారు. బ్యాంకులో పనిచేసే 82,000 మంది సిబ్బంది ఈ క్యాంపెయిన్‌లో పాల్గొని నిధుల సమీకరణ చేశారు. 2024 జనవరి 26న ప్రారంభమైన ఈ క్యాంపెయిన్‌లో తమ ఉద్యోగులు ఎంతో అంకితభావంతో పని చేశారని కెనరా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె సత్యనారాయణ రాజు తెలిపారు. కాసా లేదా రిటైల్ టర్మ్ డిపాజిట్ రూపంలో ఒక్కొక్కరూ రూ.10 లక్షలు తీసుకురావాలని కోరామన్నారు. కాసా బ్యాలెన్స్‌లలో కూడా స్థిరత్వం ఉన్నందున ఈ డ్రైవ్ మొత్తం వ్యాపారానికి సహాయపడిరదని పేర్కొన్నారు. దీంతో కెనరా బ్యాంక్ బల్క్ డిపాజిట్లపై ఆధారపడటం కూడా తగ్గిందన్నారు.

# అమెజాన్ ప్రైమ్ వీడియో యూజర్లకు అలర్ట్

ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియో యూజర్లకు అలర్ట్. ప్రైమ్ వీడియోలో ఇకపై యాడ్స్ దర్శనం ఇవ్వనున్నాయి. వచ్చే నెల నుంచి సినిమాలు, షోల మధ్యలో ప్రకటనలు కనిపించనున్నాయి. ప్రకటనల్లేని వీడియో స్ట్రీమింగ్ సేవలు పొందాలంటే అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు యూజర్లకు ఇమెయిల్స్ పంపిస్తోంది.

అమెజాన్ ప్రైమ్ సబ్‌స్క్రిప్షన్ తీసుకున్న వారికి ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ మధ్యలో ప్రస్తుతం ఎలాంటి యాడ్స్ కనిపించడం లేదు. జూన్ 17 నుంచి మాత్రం పరిమిత సంఖ్యలో యాడ్స్ దర్శనం ఇవ్వనున్నాయి. మెరుగైన కంటెంట్‌ను అందించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెజాన్ యూజర్లకు పంపిన మెయిల్స్‌లో పేర్కొంది. సంప్రదాయ టీవీ ఛానెళ్లు, ఇతర మాధ్యమాల మాదిరిగా కాకుండా 'అర్థవంతమైన' యాడ్స్ మాత్రమే ప్రదర్శిస్తామని తెలిపింది.

ప్రస్తుత ప్రైమ్ మెంబర్ షిప్ ధరలో ఎలాంటి మార్పులూ చేయడం లేదని పేర్కొంది. యాడ్ ఫ్రీ ఎక్స్‌పీరియన్స్ కోరుకునే వారి కోసం కొత్తగా రెండు ప్లాన్లను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుత ప్రైమ్ మెంబర్‌షిప్ ఉన్నవారు నెలవారీ రూ.129, ఏడాదికి రూ.699 చొప్పున యాడ్‌ఆన్ ప్లాన్స్ తీసుకుంటే ఎలాంటి ప్రకటనలూ కనిపించవని తెలిపింది. జూన్ 17 నుంచి ఈ ప్యాక్స్ అందుబాటులోకి రానున్నాయని పేర్కొంది. గతంలో ఆస్ట్రేలియా, కెనడా, మెక్సికో, యూకే, యూఎస్ వంటి దేశాలకే పరిమితమైన యాడ్స్‌ను తాజాగా భారత్‌కూ తీసుకొచ్చింది. ప్రైమ్‌లైట్ ప్లాన్ తీసుకున్న వారికి ఇప్పటికే యాడ్స్ వస్తున్నాయి.




Dear Prime member,

We are writing to you today about an upcoming change to your Prime Video experience. Starting June 17th, 2025, Prime Video movies and TV shows will include limited advertisements. This will allow us to continue investing in compelling content and keep increasing that investment over a long period of time. We aim to have meaningfully fewer ads than TV channels and other streaming services. No action is required from you, and there is no change to the current price of your Prime membership.

We will also offer a new ad free add-on option for an additional ~~₹999~~ 699 per year/ ₹129 per month* that you can sign up for starting on June 17th 2025.

# మళ్లీ నష్టాలు చవిచూసిన సూచీలు

భారత్‌పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంతో నిన్న దూసుకెళ్లిన మన సూచీలు.. నేడు భారీ నష్టాలు చవిచూశాయి. మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం ఇందుకు కారణం. ముఖ్యంగా అధిక వెయిటేజీ కలిగిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, రిలయన్స్ వంటి షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 1300 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ 24,600 స్థాయి దిగువకు చేరింది.

సెన్సెక్స్ 82,249.60 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,429.90) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 81,043.69 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1281.68 పాయింట్ల నష్టంతో 81,148.22 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 346.35 పాయింట్ల నష్టంతో 24,578.35 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.33గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ, టెక్ మహీంద్రా షేర్లు మాత్రమే లాభాల్లో ముగిశాయి. మిగిలిన షేర్లు నష్టాలు చవిచూశాయి. ఇన్ఫోసిస్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎటర్నల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి.



### కారణాలు ఇవే..

నాలుగేళ్లలో ఎన్నడూ లేని రీతిలో నిన్న సెన్సెక్స్, నిఫ్టీ దూసుకెళ్లాయి. కానీ, ఎఫ్‌ఐఐ, డీఐఐలు కలిపి కొనుగోలు చేసింది రూ.2694 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లు మాత్రమే. రిటైల్, హెచ్‌ఎన్‌ఐల కొనుగోళ్లు జరిపారు. ఈ నేపథ్యంలో నేడు గరిష్ఠాల వద్ద ప్రాఫిట్ బుకింగ్ కనిపించింది.

అమెరికాచైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో అంతర్జాతీయంగా పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. కానీ మన మార్కెట్‌కు నెగిటివ్‌గా మారింది. ఆ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగితే భారత్‌కు పరోక్షంగా లాభమన్న అంచనాలు ఇన్నాళ్లు ఉన్నాయి. తాజా పరిణామాలు కొంతమేర దాన్ని నీరుగార్చాయి.

భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో క్రూడాయిల్ ధరలు మళ్లీ క్రమంగా పెరుగుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ 65 డాలర్ల స్థాయి వద్ద ట్రేడవుతోంది. చమురు దిగుమతులపై ఆధారపడే మన దేశానికి ఇది ప్రతికూల అంశం కావడం కూడా సూచీల నష్టాలకు మరో కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ, ఇన్ఫోసిస్, రిలయన్స్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్ కలిసి సెన్సెక్స్ దాదాపు 700 పాయింట్లు క్షీణించడంలో భూమిక పోషించాయి. ఐటీ స్టాక్స్‌లోనూ లాభాల స్వీకరణతో టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాల్లో ముగిశాయి.

# కిమ్స్ హాస్పిటల్స్ లాభం రూ 106 కోట్లు




కృష్ణా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లిమిటెడ్ (కిమ్స్ హాస్పిటల్స్).. గడచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.801 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.106 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2023 24 ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.637 కోట్లుగా ఉండగా లాభం రూ.72 కోట్లుగా ఉంది. మార్చితో ముగిసిన పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను రూ.3,067 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.415 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 202425 ఆర్థిక సంవత్సరం అన్ని రకాలుగా బాగుందని, కేరళలో కొత్త హాస్పిటల్‌ను ప్రారంభించటంతో పాటు వివిధ ప్రాంతాల్లో కొత్త యూనిట్లను అందుబాటులోకి తీసుకురావటం ఎంతగానో కలిసి వచ్చిందని కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ బీ భాస్కర్ రావు తెలిపారు. కాగా ఈ ఏడాది ఏప్రిల్‌లో మహారాష్ట్రలోని థానేలో కొత్త హాస్పిటల్‌ను ప్రారంభించగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో బెంగళూరులో రెండు కొత్త యూనిట్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# మే 20న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి

ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:

కార్మిక, కర్షక, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం చింతకాని మండల పార్టీ కార్యాలయంలో మార్గం శ్రీను అధ్యక్షతన జరిగిన పార్టీ మండల సమితి సమావేశంలో జితేందర్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు పూర్తయినప్పటికీ రైతాంగ, కార్మికవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించలేదన్నారు. భారత్ వెలిగిపోతుందని మోడీ మోసపూరిత నినాదాలు ఇచ్చి నాఏమీ వరగలేదన్నారు. ప్రపంచంలో 125 దేశాల్లో భారత్ 111వ స్థానంలో ఉందన్నారు. బీజేపీ మతం పేరుతో దేశ సమగ్రతను దెబ్బతీస్తూ అబద్దపు ప్రచారం చేస్తుందన్నారు. ఉగ్రవాదం దేశానికి పెను ప్రమాదం అని అది ఏ రూపంలో ఉన్నా తుద ముట్టించాల్సిందేనన్నారు.కమ్యునిస్టు పార్టీ లేకుంటే హక్కులు సాధించబడేవి కావని యువజన విద్యార్థి, కార్మిక, కర్షక, మహిళా హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా నిరంతరం పోరాడుతుందన్నారు. అన్ని గ్రామ,ప్రజా సంఘాల శాఖా సమావేశాలు పూర్తి చేసి త్వరలో మండల మహాసభ నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, మండ లకార్యదర్శి పావులూరి మల్లిఖార్జునరావు, జిల్లా సమితి సభ్యులు కూచిపుడి రవి, రాసాల మోహన్ రావు, మండల సహాయ కార్యదర్శులు దూసరి గోపాలరావు, అబ్బూరి మహేష్, నాయకులు అమర్లపుడి వెంకన్న, బొడ్డు కొండలరావు, తూములూరి రంగయ్య, శీను, ఏపూరి నర్సయ్య, చాట్ల బాబు, కొత్తపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# పోరాటాలు చేస్తేనే ప్రజా సమస్యలు పరిష్కారం...

17 న ఖమ్మం నగర కార్పొరేషన్ కార్యాలయాల ముట్టడి...
–సీపీఐ (ఎం) ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్

ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:

నగర పరిధిలోని పేదలు ఎదుర్కొంటున్న సమస్యల పైన ఈనెల 17 న ఖమ్మం నగర కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టనించనున్నట్లు సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ తెలియజేశారు. మంగళవారం నాడు స్థానిక సుందరయ్య భవనం నందు సీపీఐ(ఎం) ఖమ్మం టూ టౌన్ మండల కమిటీ సమావేశం లో వై విక్రమ్ పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైందని అన్నారు. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రజలకు 6 గ్యారంటీల పేరుతో పథకాలు వాగ్దానం చేసి అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా రూ.12 వేలు ఇస్తామని వాగ్దానం చేసి గ్రామీణ ప్రాంతాల్లో అనేక కొర్రీలు పెట్టి ఇవ్వడం లేదని ఆరోపించారు. భూమిలేని పేదలు పట్టణాల్లో ఉంటే పేదలు కారా అని ఆయన ప్రశ్నించారు. పట్టణ పేదలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేస్తూ ఏడాదికి రూ.12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో భూములు లేక ఉపాధి కరువై పట్టణ ప్రాంతాలకు వలసలు వచ్చి అడ్డా కూలీలుగా జీవనోపాధి పొందుతున్న పేదలకు ఉపాధి హామీ పథకాన్ని వర్తింపజేసి జీవనోపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఖమ్మం నగర పరిధిలోని ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. అనేక సంవత్సరాలుగా కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తులు చేసుకొని ఎదురుచూస్తున్నారని కొత్త పెన్షన్లు వెంటనే ఇవ్వాలన్నారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. నగర పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని అన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇండ్ల మంజూరు చేయాలన్నారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో సరైన మాస్టర్ ప్లాన్ ని రూపొందించాలని వారు అన్నారు. అప్లై చేసుకున్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వాలని అనేక కారణాల చేత వాటిని ఇంకా పెండింగ్లో ఉంచారని ఆన్లైన్లో పెండింగ్ ఉన్న వాటిని వెంటనే మంజూరు చేయాలని అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటాలు తప్పదు అని తెలిపారు. ప్రజలు ఎదుర్కొన్న సమస్యల పైన సిపిఎం ఆధ్వర్యంలో జరగబోయే మున్సిపల్ కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు నర్రా రమేష్, జె వెంకన్న బాబు, డి వీరబాబు, రవీంద్ర, చిన్న హుస్సేన్, సిహెచ్ భద్రం, ఫకీరు సాహిబ్, మల్లికార్జున్ రెడ్డి, గుమ్మడి బిక్షం, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు

# బాధిత కుటుంబానికి ఎల్ ఓ సి అందజేసిన ఎమ్మెల్యే

వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:



పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామానికి చెందిన బూసని అశోక్ కుమారుడు గౌతమ్ ప్రమాదవశత్తు రోడ్డు ప్రమాదంలో కాళ్లను కోల్పోయాడు.ఈ క్రమంలో వైద్యం చేయించుకునేందుకు తమ ఆర్థిక స్తోమత లేదని, వైద్యపరమైన ఆర్థిక సహాయ సహకార అందించాలని కుటుంబ సభ్యులు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ని కోరడంతో అందుకు స్పందించిన ఆయన ప్రభుత్వ పరంగా చికిత్స నిమిత్తం 1లక్ష 25 వేల రూపాయల ఎల్ఓసి ని మంజూరు చేయించారు.మంజూరైన ఎల్ఓసి ని మంగళవారం ఎమ్మెల్యే హైదరాబాదులోని తన కార్యాలయం లో బాలుడి తండ్రి అశోక్ కు అందజేశారు.ఆపద కాలంలో ఆర్థిక స్తోమత లేని తమ కుటుంబానికి ఎమ్మెల్యే అండగా నిలిచారని అడిగిన వెంటనే ప్రభుత్వపరంగా ఎల్ఓసి మంజూరు చేయించి తన కుమారుడికి వైద్యపరమైన సహాయం అందించినందుకు కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలియజేశారు.

# రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్ నగర్,తెలంగాణ ముచ్చట్లు:



కొదూర్గ్ మండలంలోని విశ్వనాథ్‌పూర్, వెంకిర్యాల గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం రైతులకు ఎంతో ప్రయోజనకరమని తెలిపారు.

ఈ చట్టాన్ని జిల్లా స్థాయిలో పైలట్ ప్రాజెక్టుగా మొదటగా కొదూర్గ్ మండలంలో అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భూ సంబంధిత సమస్యలు ఉన్న రైతులు, భూ యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని పిలుపునిచ్చారు. గత చట్టాల్లోని లోపాలను పరిశీలించి, మేధావులు, రైతు సంఘాల సూచనలతోనే భూ భారతిని రూపొందించామని చెప్పారు.

ఈ చట్టం ద్వారా భూసంబంధిత అన్ని సమస్యల పరిష్కారమే కాకుండా భూధార్ కార్డు కూడా మంజూరవుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణ రెడ్డి, తహసీల్దార్ రమేష్ కుమార్, దామోదర్ రెడ్డి, గోవర్ధన్ గౌడ్, మల్లేష్ గౌడ్, లింగం గౌడ్, మాసయ్య, రామకృష్ణ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, యాదయ్య, కృషయ్య తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా కేంద్రంలో రోడ్ల విస్తీర్ణ పనులు వేగవతం చేయాలి

- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:

కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో మున్సిపల్ శాఖ కమిషనర్ తో,మరియు స్థానిక తసిల్దార్ తో రోడ్లు భవనాలశాఖ అధికారులతో మంగళవారం జిల్లా కలెక్టర్ బేటి అయ్యారు.వనపర్తి పట్టణలో పాన్ గల్ రోడ్డు, కొత్తకోట రోడ్డు, పెబ్బేరు రోడ్డు రహదారుల విస్తీర్ణ గురించి పై కనపరిచిన శాఖ అధికారులతో క్లుప్తంగా వివరిస్తూ రోడ్డుకు అడ్డుగా ఉన్న షాపులు. మరియు ఇండ్లు యజమానులకు మున్సిపల్ శాఖ ద్వారా నోటీసులు జారీ చేసి రోడ్ల విస్తీర్ణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి ఆర్డీవో సుబ్రహ్మణ్యం, వనపర్తి స్థానిక తహసిల్దార్ రమేశ్ రెడ్డి,వనపర్తి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు,జిల్లా రోడ్ల భవనాల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవు

- ఎస్పీ కార్యాలయం ముందు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు
- ప్రజలకు ఎల్లప్పడూ అందుబాటులో ఉంటా
- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:



తమ వ్యక్తిగతమైన కారణాలవల్లగాని, కుటుంబ కలహాల వల్లగాని, ఇతరుల చేత బాధించబడినా,మరే కారణాల వల్లగాని బాధితులు నేరుగా వచ్చి పోలీస్ స్టేషన్ లో గాని, తమకు గాని వచ్చి ఫిర్యాదు చేయాలి. అంతేగాని విధి నిర్వహణలలో ఉన్న ప్రభుత్వ అధికారుల ముందు,ప్రభుత్వ కార్యాలయాల ముందు ఆత్మహత్యకు పాల్పడే ప్రయత్నాలు చేసినా,బెదిరింపులకు పాల్పడినా వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ తెలియజేసారు.మేనమామ సోదరుడి నుండి ప్రాణహాని ఉందని, తనకు రావలసిన ఆస్తులను ఇప్పించాలని కోరుతూ పోలీసులకు సంబంధం లేని విషయంలో,బెదిరించే నెపంతో జంగాలగుట్టకు చెందిన శిరువాటి శంకర్ తన భార్య ముగ్గరు పిల్లలపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనను జిల్లా పోలీస్ అధికారి ఉదహరిస్తూ పోలీస్ అధికారులకు సంబంధంలేని విషయంలో, జిల్లా పోలీసు కార్యాలయం ముందు న్యూసెన్స్ చేసినందుకు వారిపై కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు. ఇక మీదట ప్రభుత్వ కార్యాలయాల ముందు, ప్రభుత్వ అధికారుల ముందు ఇలా చట్టవిరుద్ధంగా ప్రవర్తిస్తే ఆ సన్నివేశాన్ని వీడియో చిత్రీకరణ చేసి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేయడం జరుగుతుంది.ఈ విషయాన్ని గ్రహించి తమ తమ న్యాయపరమైన సమస్యలను, ఫిర్యాదులను ప్రజలు పోలీసువారి వద్దకు నేరుగా వచ్చి న్యాయపరంగా,చట్టపరంగా పరిష్కరించుకోవాలి గాని అధికారులకు, వారి విధులకు ఆటంకం కలిగించవద్దని జిల్లా ఎస్పీ తెలిపారు.



# జోగుపర్తి కుటుంబానికి మాజీ ఎంపీ నామ, సండ్ర పరామర్శ

ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:

పాలేరు నియోజకవర్గం, తిరుమలయపాలెం మండలం తాళ్లచెరువు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జోగుపర్తి వెంకటేశ్వర్లు సోదరుడు ప్రసాద్ సోమవారం ఉదయం గుండెపోటుతో మరణించారు. ఇట్టి విషయం తెలుసుకున్న ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యలు మంగళవారం గ్రామం లోని వారి నివాసానికి వెళ్లి ప్రసాద్ పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి పరామర్శించారు. ప్రసాద్ ఆత్మకి శాంతి కలగాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. నామ వెంట తాళ్లూరి జీవన్ కుమార్, తిరుమలయపాలెం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బాషబోయిన వీరన్న, డిసిసిబి డైరెక్టర్ చావా వేణు, కొండబాల వెంకన్న, బెల్లం వేణుగోపాల్, మల్లిడు వెంకన్న, ఉపాధ్యక్షులు ఆర్మీ రవి, మాజీ సర్పంచ్ మంచా నాయక్, మైనార్టీ నాయకుడు ఎస్ కే చందు, మనుకొండ రాజా, వాలూరి దామోదర్, గుడిపూడి రాజా, వాలూరి మోహన్ రావు, మోరంపూడి ప్రసాద్ రావు, గొడ్డేటి మాధవరావు, కొండబాల కరుణాకర్, పాల్వంచ రాజేష్, సుతాగాని రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ రఘురాం రెడ్డి కృషితో.. 30ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రైల్వే స్టేషన్ రోడ్డు విస్తరణకు మోక్షం

- మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తో ప్రత్యేక భేటీ
- చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా మరోచోట దుకాణాల ఏర్పాటుకు హామీ
- కృతజ్ఞతలు తెలిపిన దుకాణదారులు

ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:

జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఎదుట ఇరుకు రోడ్డు, దాని వెంట దుకాణాలతో రద్దీ ఏర్పడి రైల్వే ప్రయాణికులు, ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్న సమస్యకు.. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి చొరవతో.. పరిష్కారం లభించబోతోంది.

ఇటీవల కాలంలో.. రైల్వే స్టేషన్ లో ఎస్కలేటర్, ఇతర అభివృద్ధి పనులను ఎంపీ రఘురాం రెడ్డి రెండుసార్లు పరిశీలించిన సందర్భాల్లో.. రోడ్డు విస్తరణ లేక ఇబ్బంది పడుతున్న విషయం ఆయన దృష్టికి వచ్చింది. ఆ తర్వాత రైల్వే జీఎంను కలిసి ప్రాధాన్యతను వివరించగా.. ఆమోదం లభించింది. ఈ క్రమంలో మంగళవారం పలువురు చిరు వ్యాపారులతో కలిసి.. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్ అభిషేక్ అగస్త్యను ఎంపీ కలిశారు. దుకాణాలు నిర్వహించే వారికి.. రోడ్డు విస్తరణ తర్వాత ప్రత్యామ్నాయంగా ఆ ప్రాంతంలో ఏర్పాట్లు చేయాలని సూచించగా.. అందుకు కమిషనర్ అంగీకరించారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని ప్రకటించారు. దీంతో..గత 30 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న రైల్వే స్టేషన్ ఎదుట రోడ్డు విస్తరణ పనులకు మోక్షం లభించబోతోంది. ఎంపీ రఘురాం రెడ్డి ఎంతో చొరవ చూపి..రోడ్డు విస్తరణ చేపడుతున్నారని, అలాగే.. తమ జీవనోపాధి దెబ్బ తినకుండా.. ప్రత్యామ్నాయం చూపారని పేర్కొంటూ అక్కడి చిరు వ్యాపారులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.



# ఘనంగా పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

వేలేరు,తెలంగాణ ముచ్చట్లు:



వేలేరు మండలంలోని పీచర గ్రామంలో మంగళవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 2007 2008 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులంతా 17 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో రోజంతా ఉత్సహంగా, ఉల్లాసంగా గడిపారు. విద్యా బోధన చేసిన గురువులను శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందించారు. ఆయా రంగాల్లో, ఉన్నత స్థానాల్లో స్థిరపడిన విద్యార్థులను చూసి గురువులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఒకే దగ్గర కూర్చుని కష్టసుఖాలను పాల్పపంచుకున్నారు. కొంతసేపు ఆడి పాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజునాయక్, చందర్ రావు,ఈశ్వర్,రమేష్, బీయాబాని,జాఫర్ ఆలీ,బాబు, ప్రశాంతి, ఇందిర,అరుణ, శేఖర్ బాబు పాల్గొన్నారు.

తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






# తెలుగుదేశం పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలి

- ఖమ్మం నియోజకవర్గం పరిశీలకులు కాపా క్రిష్ణ మోహన్ పిలుపు

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ హడ్ హక్ కమిటీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం అధ్యక్షతన కార్యకర్తల సమన్వయ సమావేశం జరిగింది, ఈ కార్యక్రమానికి ఖమ్మం నియోజకవర్గ పరిశీలకులు కాపా కృష్ణ మోహన్ గారు హాజరై మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే వ్యక్తులను డివిజన్ అధ్యక్ష కార్యదర్శుల గా ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు, రాబోయే కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కమిటీల నియామకం జరగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో హడ్ హక్ కమిటీ సభ్యులు కేతినేని హరీష్, పాలేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి కొండబాల కరుణాకర్, లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు, రాజరాజేశ్వరి, పాలడుగు కృష్ణ ప్రసాద్, మందపల్లి రజిని, రాయల కోటేశ్వరరావు, అబ్దుల్ మజీద్, షేక్ జానీ, ఎస్ వి రమణ, ఉప్పుతల్ల విజయ్, చల్లగుండ్ల రమేష్, చింతనిప్పు నాగేశ్వరావు, గడుపుడి వెంకటేశ్వరావు, చుండూరు రాజరాజేశ్వరి, రాయల కోటేశ్వరరావు, కామ అనిత, బోయిన వెంకన్న, కామినేని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులలో దరఖాస్తుల స్వీకరణ...

- తహశీల్దార్లు పున్నంచందర్, రాంబాబు లు.
- భూ భారతి చట్టంతో భూ సమస్యలు వేగంగా పరిష్కారం

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**





భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని, గ్రామాల్లో చేపడుతున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు తహశీల్దార్లు ఏ. పున్నం చందర్, ఆర్. రాంబాబు లు అన్నారు. మంగళవారం బోనకల్ మండలం రావినూతల, రాపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూ సమస్యలకు సంబంధించి రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు.

ఈ సందర్భంగా తహశీల్దార్లు మాట్లాడుతూ, రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావాన్ని తావు నీయకుండా జవాబుదారుతనాన్ని పెంచేందుకు భూ భారతి చట్టాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, ముటేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులు చేర్పులు వంటి సేవలు సులభతరం అవుతాయని తెలిపారు. రైతులకు, అధికారులకు సులభంగా అర్థం అయ్యేలా సామాన్య, గ్రామీణ ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా భూ భారతి చట్టం ఉందన్నారు.

హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు భూ భారతి లో అవకాశం ఉందన్నారు. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందన్నారు. భూమి హక్కులు ఏ విధంగా సంక్రమించిన మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేయవచ్చన్నారు. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టంలో రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని తెలిపారు. భూదార్ కార్డుల జారీ జరుగుతుందన్నారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం లభిస్తుందని తెలిపారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని, మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి, ఎవరైనా ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దుచేసే అధికారం చట్టంలో ఉందన్నారు

హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు, భూమి హక్కులు ఉంది రికార్డులో లేనివారు హక్కుల రికార్డులో నమోదు చేయించుకోవడానికి కొత్త చట్టం వచ్చిన సంవత్సరం లోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

ఈ సందర్భంగా రావినూతల గ్రామంలో చేపట్టిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలకు సంబంధించి 122, రాపల్లి గ్రామ రెవెన్యూ సదస్సులో 144 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులకు అధికారులు రశీదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బోనకల్ మండల ఆర్ఐలు నవీన్, మైథిలి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే

**పాలకుర్తి , తెలంగాణ ముచ్చట్లు :**

పాలకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సంక్షేమ కార్యక్రమంలో పాలకుర్తి శాసన సభ్యురాలు శ్రీమతి యశస్విని రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దవంగర మండలానికి చెందిన వివిధ గ్రామాల 19 మంది లబ్దిదారులకు రూ. 19,02,204 విలువైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ పథకాల మద్దతుతో పేద కుటుంబాలకు చెందిన యువతుల పెళ్లి ఖర్చులకు ప్రభుత్వం నుండి సహాయం అందుతుంది. కళ్యాణలక్ష్మి (హిందూ, బౌద్ధ, ఇతర ధర్మాల వారికి), షాదీ ముబారక్ (ముస్లిం మైనారిటీలకు) పథకాలు పేద వర్గాల మహిళల గౌరవమైన జీవితానికి బలమైన పునాదిగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం, అదే కార్యాలయంలో పాలకుర్తి నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 111 మంది లబ్దిదారులకు, ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ. 37,66,500 చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా పంపిణీ చేశారు. ఈ నిధులు వైద్య చికిత్స, విద్యా సహాయం, ఇతర అత్యవసర అవసరాలకు అవసరమైన లబ్దిదారులకు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి యశస్విని రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తోంది. ముఖ్యమంత్రి సహాయ నిధి, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు బలాన్ని ఇస్తున్నాయి. నా నియోజకవర్గంలోని ప్రతి అర్హత గల లబ్దిదారునికి ఈ పథకాల లాభాలు చేరేలా నిత్యం కృషి చేస్తాను. ప్రజల సంతోషమే నా ప్రోత్సాహం, అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులకు, సిబ్బందికి, ప్రజా ప్రతినిధులకు, గ్రామస్తులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. లబ్దిదారులు కూడా తమ అభినందనలతో ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలిపారు, బ్లాక్ అధ్యక్షులు, వివిధ మండల అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, మహిళ నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.



# వనపర్తి బస్ డిపోలో బస్సుల సంఖ్య పెంచండి

- మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి
- అఖిలపక్ష ఐక్యవేదిక డిమాండ్

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

వనపర్తి బస్సు డిపో ను మంగళవారం అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు సందర్శించారు. డిపో మేనేజర్ కు వినతిపత్రం ఇస్తూ ,అధ్యక్షుడు సతీష్ యాదవ్ మాట్లాడుతూ.. దూర ప్రాంతాలకు, మారుమూల ప్రాంతాలకు మరియు పుణ్యక్షేత్రాలైన యాదగిరిగుట్ట,మంత్రాలయం,శ్రీశైలం,తిరుపతి లకు వెంటనే బస్సులు వేయాలని, మాజీ ఎమ్మెల్యేల గ్రామాలకు జయరాములు వారి గ్రామం గుమ్మడం కు మరియు బాల కృష్ణయ్య గ్రామం చిట్యాల పెద్దమందడి మీదుగా మహబూబ్నగర్, హైదరాబాద్ బస్సులు నడుపాలని, పాత బస్టాండు నిర్మాణం చేయించి,మరియు మారుమూల గ్రామాలకు బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. స్క్రాప్ బస్సులో స్థానంలో 20 బస్సులు వచ్చాయని అవి సరిపోక మరో 25 బస్సులు డిపోకు అవసరమని వెంటనే తెప్పించాలని ఎమ్మెల్యే మేగారెడ్డి కి, కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సతీష్ యాదవ్,వెంకటేశ్వర్లు,కొత్త గొల్ల శంకర్ గౌనికాడి యాదయ్య, రాజ్ కుమార్,మన్యం నాయక్,రాము యాదవ్,శివకుమార్,పుట్ట పాక బాలు తదితరులు పాల్గొన్నారు.






# తాటికాయలలో ఘనంగా ఫాతిమా మాత దేవాలయ వార్షికోత్సవ వేడుకలు



**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:**

ధర్మసాగర్ మండలంలోని తాటికాయల గ్రామంలో ఫాతిమా మాత దేవాలయ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. మల్కాపూర్ విచారణ గురువు రామంచ శరత్ కుమార్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించబడ్డాయి.

ఈ సందర్భంగా ఫాతిమా మాత విగ్రహాన్ని గ్రామ వీధుల్లో డప్పులు, సప్పుళ్ళతో ఉత్సాహంగా ఊరేగించారు. ఊరేగింపులో పాల్గొన్న క్రైస్తవ భక్తులు టెంకాయలు కొడుతూ, తమ వీధుల్లోకి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం చర్చిలో ఫాదర్లు శరత్ కుమార్, పూదోట దాసయ్య, గంగారపు నవీన్‌లు,ఇన్నయ్య,జోసెఫ్,జార్జ్, ఆరోగ్యం ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.

వారు మాట్లాడుతూ క్రైస్తవ సంఘం ఐక్యతతో ముందుకు సాగితే సమాజంలో సానుకూల మార్పులు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.

ఫాతిమా మాత ప్రసాదించిన సందేశాలు ప్రపంచ శాంతికి, మారుమూల గ్రామాల్లో ఉన్న విశ్వాసులకు, బలహీనులకు వెలుగుగా నిలిచాయని వివరించారు. ప్రపంచంలో చెడును ఎదుర్కొనేందుకు ప్రార్థనే ప్రధాన ఆయుధమని, ఫాతిమా మాత అందించిన సందేశాల్లో ఇది ముఖ్యంగా చెప్పబడిందని చెప్పారు.

అలాగే, “ఈ రోజు మన గ్రామంలో ఇలాంటి మహత్తరమైన ఉత్సవాన్ని నిర్వహించుకోవడం గొప్ప భాగ్యంగా భావించాలి. ప్రతి ఒక్కరూ భక్తి, శ్రద్ధలతో ప్రవర్తించాలి. ఫాతిమా మాత ఆశీస్సులతో ప్రతి కుటుంబం సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థించాం. సమాజంలో ప్రేమ, సహన, శాంతి విలువలు విస్తరించేందుకు ఇలాంటి వేడుకలు స్ఫూర్తిగా నిలుస్తాయి,” అని ఫాదర్లు పేర్కొన్నారు.ప్రార్థనల అనంతరం భక్తులకు విందు ఏర్పాటుచేశారు.

ఈ వేడుకల్లో సిస్టర్లు సునీత,వాసంతి,మేరీ, ఉపదేశి పట్ల శ్రీనివాస్(సీమోను), సంఘపెద్దలు నల్ల రాములు, ఎర్ర యాదగిరి, పట్ల రాంచందర్, బొల్లెపాక వెంకటస్వామి, ఎడ్ల యాదగిరి, డాన్ బోస్కో యూత్ సభ్యులు, గ్రామస్థులు, పెద్ద ఎత్తున క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

బుధవారం-14- మే 2025

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**ఉమ్మడి బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

మంగళవారం చింతకాని మండలం నాగిలిగొండ గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు. పగడాల. రాధాకృష్ణ. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు ఆర్థిక ప్రణాళిక ఇంధన శాఖామాత్యులు మల్లు భట్టి విక్రమార్క సిఫార్సు మేరకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు ఈ చెక్కులను తీసుకున్నవారు పంది మురళీ కృష్ణ 42,500 రూపాయలు మరియు షేక్ నజీమా 26000 రూపాయల చెక్కులను తీసుకున్నారు ఇట్టి కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్ష ఉపాధ్యక్షులు పగడాల రాధాకృష్ణ చాట్ల రాజశేఖర్ మరియు గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ జమ్ముల కృష్ణారెడ్డి, ఏపూరి సత్యం కిసాన్ సెల్ అధ్యక్షులు మద్దిన్ని.లక్ష్మయ్య, ఎస్ కే భాష ,పంది మురళీకృష్ణ, మరియు జమ్ముల అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు మల్లు. భట్టి విక్రమార్క కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.








# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి...

- **అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి.**
- **తల్లాడ మండలం కుర్నవెల్లి లో ధాన్య కొనుగోలు కేంద్రం తనిఖీ, తల్లాడ లో రైస్ మిల్లర్ల తో సమావేశం నిర్వహించిన అదనపు కలెక్టర్.**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

ధాన్య కొనుగోలు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్, తల్లాడ మండలం కుర్నవెల్లి గ్రామంలో ధాన్య కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు.
కొనుగోలు కేంద్రానికి ఎంత మేర ధాన్యం వచ్చింది, ఎంత కొనుగోలు చేసింది, ఎంత మేర ధాన్యానికి డబ్బు చెల్లించినది అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు ఎఫ్ఏక్యూ నాణ్యత ప్రమాణాల మేరకు చేపట్టాలన్నారు. తేమ శాతం వచ్చిన వెంటనే కొనుగోలు చేయాలని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. గన్నీ సంచులు, టార్పాలిన్ లు అవసరం మేరకు అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు.
అనంతరం అదనపు కలెక్టర్, తల్లాడ ఎంపిడివో కార్యాలయంలో కల్లూరు డివిజన్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. మిల్లర్లు కేటాయించిన లక్ష్యం మేరకు ధాన్యం దిగుమతి చేసుకోవాలన్నారు. ధాన్యం అన్లోడింగ్ వెంటవెంటనే జరిగేలా అవసరం మేర హమాలీల ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎఫ్ఏక్యూ ప్రమాణాల మేరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు, తరుగు, తాల్ పేరిట రైతుల నుండి కోతలు చేస్తే ఉపేక్షించేది లేదని అన్నారు. రైతుకు నష్టం కల్గిస్తే చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, కల్లూరు ఆర్డీవో ఏ. రాజేందర్ గౌడ్, తల్లాడ తహసీల్దార్ రామకృష్ణ, పౌరసరఫరాల ఆర్ఐలు, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన కాజీపేట ఏసీపీ పింగళి ప్రశాంత్ రెడ్డి

**కాజీపేట,తెలంగాణ ముచ్చట్లు:**



నూతనంగా బాధ్యతలు చేపట్టిన కాజీపేట అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) పింగళి ప్రశాంత్ రెడ్డి మంగళవారం ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పోలీసు సిబ్బందితో సమావేశమై పలు ముఖ్య సూచనలు చేశారు.
అవినీతిని అరికట్టడంలో భాగంగా, నిషేధిత గంజాయి రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఫిర్యాదుదారుల సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రస్తుత ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీసు సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.
ఈ సందర్శనలో ఏసీపీ పోలీసు సిబ్బందికి ప్రోత్సాహకరమైన మాటలు చెప్పారు. ప్రజలతో సానుకూల సంబంధాలు పెంపొందించుకోవాలని, న్యాయసమ్మతంగా విధులు నిర్వహించాలని సూచించారు.

# ఫామ్ ఆయిల్ తోటలతో రైతులకు అధిక లాభాలు

- **అంతర్గత పంటలకు ఫామ్ ఆయిల్ తోటలు అనువుగా ఉంటాయి**
- **మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**

**వనపర్తి,తెలంగాణ ముచ్చట్లు :**

ఫామ్ ఆయిల్ తోటలతో రైతులు తక్కువ పెట్టుబడి తో అధిక లాభాలు పొందవచ్చని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మంగళవారం వనపర్తి మండలం అచ్యుతాపురం గ్రామంలో బోయినీ వాసు 4ఎకరాలతో సాగు చేస్తున్న ఫామ్ ఆయిల్ తోటను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాల ప్రయోజనాల కోసం నా హయాంలో ఫామ్ ఆయిల్ తోటలు పట్ల రైతులకు అవగాహన కల్పించి సాగు దిశగా ప్రోత్సహించామని అన్నారు. ఫామ్ ఆయిల్ తోటల వల్ల రైతులు దీర్ఘకాల ఆదాయం పొందుతూ అదేవిధంగా అంతర్గత పంటల వేసుకొని జీవనోపాధి పొందవచ్చని అన్నారు.మార్కెట్లో ఫామ్ ఆయిల్ మంచి గిరాకీ ఉన్నదని భవిష్యత్తు మొత్తం ఫాం ఆయిల్ తోటలది అని అన్నారు.పంట సాగు చేస్తున్న వాసుకు పలుసూచనలు చేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శారద ఆశన్న నాయుడు,చిట్యాల రాము,నరసింహ,బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# మంచీ-చెడూ నేర్పితేనే మంచి పౌరులయ్యేది!

భావిభారత భవితవ్యాన్ని ఘనంగా ఆవిష్కరించంలో నేటి బాలలకు, విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మేధావులు, విద్యావంతులు తగిన మార్గ నిర్దేశం చేయాలి. ఎక్కడో జరిగిన అవాంఛనీయ సంఘటనలకు భయపడి, తమ పిల్లలు కూడా అదే బాటపడతారనే భయంతో, పిల్లల విషయంలో చూసీ చూడనట్లు వ్యవహరించడం వలన భవిష్యత్తులో జరిగే అనర్థాలు అత్యంత ప్రమాదకరంగా ఉంటాయి. అతి గారాబంతో పిల్లలను పెంచడం మంచిది కాదు. విద్యార్థుల విషయంలో తల్లిదండ్రులు అత్యంత జాగరూకతతో వ్యవహరించాలి. ఈ మధ్యకాలంలో చాలామంది విద్యార్థులను చూస్తున్నాం. ఫోన్ కొనివ్వలేదని, ల్యాపటాప్ చూడనివ్వలేదని, బాగా చదువుకోమంటున్నారని, మార్కులు సరిగా రాలేదని, తల్లిదండ్రులు మందలించారని, ప్రిన్స్‌పల్ తిట్టాడని, ఉపాధ్యాయుడు కొట్టాడని ఇలా వేర్వేరు కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారి గురించి వింటూనే ఉన్నాం. అడిగినవన్నీ కొనిచ్చి, అతి గారాబం చేయడం వలన, పొగడ్తలకు అలవాటుపడి, ఎప్పుడో ఒకసారి తల్లిదండ్రులు తిట్టినందుకు తీవ్రంగా మనస్తాపం చెంది, ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న నేటితరం బాలల, విద్యార్థుల మానసిక స్థితిని గురించి తల్లిదండ్రులు కూలంకషంగా అధ్యయనం చేయాలి. మంచి పని చేస్తే చిన్న ప్రశంస, చెడ్డ పని చేస్తే మందలించడం అవసరం. దాదాపు 5 సంవత్సరాల వయసు వచ్చే వరకు పిల్లలపై భారం మోపకూడదు. ఆటపాటలతో, మన వ్యవహారశైలితో వారికి ప్రేమాప్యాయతలను చవిచూపించాలి. చిన్నచిన్నకథలద్వారా, పాటలద్వారా వారికి లోకం గురించిన ప్రాథమిక అవగాహన కలిగించాలి. టివిలకు, మొబైల్ ఫోన్లకు పిల్లలను దూరంగా ఉంచాలి. పుస్తకాలలోని బొమ్మల ద్వారా జ్ఞానం వైపు దృష్టిని మళ్ళించాలి. స్పష్టమైన ఉచ్చారణ అలవాటు చేయాలి. నాట్యం, సంగీతం వైపు ఆసక్తి కలిగేలా చేయాలి.
కేవలం రెండు మూడు సంవత్సరాల వయసులోనే స్కేటింగ్, స్విమ్మింగ్ వంటి వాటి జోలికిపోవద్దు. 5 సంవత్సరాలు దాటిన తర్వాత పిల్లలకు వారి తప్పులను తెలియ చేసి, సన్మార్గంలో పెట్టడం అవసరం. అలాకాకుండా ఏం చేసినా పొగడుతూ, పెంచడం వలన పిల్లలు మనకు తెలియకుండానే ఒక కంఫర్ట్ అండ్ సెన్సిటివ్ జోన్‌లోకి వెళ్ళి పోతున్నారు. ఎండలోకి వెళ్ళనీయకుండా, వానకు తడవనీయకుండా, దుమ్ము ధూళి సోకనీయకుండా, ముట్టుకుంటే హాండ్ వ్యాష్ చేసుకునే విధంగా పెంచడం వలన పిల్లల్లో రోగనిరోధక శక్తితగ్గిపోతుంది. చేతులు కడుక్కోవాలి. కాని ఖరీదైన హ్యాండ్ వాష్‌తో కాదు. బలమైన ఆహారం పెట్టండి. చికెన్లు, మటన్లు, బిర్యానీలు తింటే బలమొస్తుందనే భ్రమను వీడండి. రోజూ ఒకే రకమైన తిండి పెట్టకండి. మెనూ మార్చండి. పిల్లలకు అన్ని రకాల పోషకాలు అందేటట్లు చూడండి. చిన్నప్పటి నుండే రుచిపచీ లేని ఆహారం పెట్టి పిల్లలను చప్పిడి కూటితో రుచికి దూరం చేయకండి. కెమికల్ ఫుడ్‌కు పిల్లలను దూరం ఉంచాలి. తల్లిదండ్రులకు, బంధువులకు, పెద్దలకు పిల్లలను దగ్గర చేయాలి. అప్పుడప్పుడూ గ్రామీణ వాతావరణాన్ని పిల్లలకు పరిచయం చేయడం. ప్రకృతి అందాలను పిల్లలను ఆస్వాదించనీయండి. పిల్లలకు చిన్నప్పటినుండే మంచి మంచి ప్రదేశాలను చూపించండి. మంచి వాతావరణంలో పెరిగేటట్లు చేయండి. తల్లిదండ్రులు పద్ధతిగా ఉంటే పిల్లలు కూడా పద్ధతిగా పెరుగుతారు. కుటుంబ వాతావరణం సరిగా లేకపోతే పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుంది. ఆటపాటలతో, చదువు సంధ్యలతో, అందరితో కలివిడిగా ఉండేటట్టు పిల్లలను పెంచండి. మంచి చదువు, సంస్కారం, ఇతరులకు పెట్టే గుణం, మంచిని పంచే గుణం పిల్లలకు నేర్పండి. కుళ్ళు, కుతంత్రాలు, స్వార్థపూరిత మైన మనస్తత్వాలను విడనాడి, పిల్లలను సద్గుణాలతో పెంచండి. ఏ విత్తనం నాటితే అదే మొక్క మొలుస్తుంది. పిల్లల పెంపకం అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో సాగాలి. పెద్దలను గౌరవించకపోవడం, తల్లిదండ్రులను పట్టించుకోకపోవడం, మేలుచేసిన వారికి కీడును తలపెట్టడం, కృతజ్ఞత మరచి ప్రవర్తించడం, స్వార్థం పతాక స్థాయికి చేరడం నేటి సమాజంలో చూస్తున్నాం. పెట్టి తినే సంస్కృతి పోయి, దోచుకుని తినే సంస్కృతి ప్రబలింది. ఇలాంటి లక్షణాలు గల వాతావరణంలో పిల్లలు పెరిగితే వారు భవిష్యత్తులో ఎలా తయారవుతారో వేరే చెప్పనక్కరలేదు. ఆకాశంలో విహరిస్తూ, నేలను తూలనాడడంలో ఔచిత్యం లేదు. నింగినంటే భవనాలకు కూడా నేలే ఆధారమన్న సత్యం విడవరాదు.



మట్టిలో కలిసే శరీరాలకు మేలిమి రంగులు పూసి, మట్టి వాసనను అసహ్యించుకోవడం అత్యంత అసహ్యకరం. నేలవిడిచి సాము చేయడం మూర?త్వం. వృక్షం శాఖోపశాఖలుగా విస్తరించి, మహా వృక్షమైనా దాని వేళ్ళు మట్టిలోనే ఉంటాయన్న నిజం మరిస్తే ప్రమాదం. ఎవరు, ఎంత ఎత్తుకు ఎదిగినా, వారి చూపు భూమిపై కేంద్రీకరించక తప్పదు. ఆకాశం వైపు చూస్తూ నడిస్తే, నేలపై బోర్లాపడక తప్పదు. అప్పుడు కూడా నేలే ఆధారం. దారం లేని గాలి పటం నేలపై పడకతప్పదు. దీనిని బట్టి మనకు విషయం అర్ధం కావాలి. వెలుగునిచ్చిన దీపాన్ని ఆర్పేసి, ఎక్కించిన నిచ్చెనను కూలదోసి, అవహేళన చేయడం మూర?త్వం. గాలికి వంగిన చిన్న మొక్కను అలాగే వదిలేస్తే ఆ మొక్క పెరిగి వంకర టింకర చెట్టుగా తయారవుతుంది. వంగిన మొక్కను నిటారుగా నిలబెట్టడానికి చిన్నకర్రతో మొక్కను కట్టినట్టు, సద్గుణాలతో, మంచి మాటలతో పిల్లలకు చిన్నతనం నుండి విలువలను నేర్పితే పెద్దయ్యాక రుజుమార్గంలో పయనించే అవకాశమేర్పడుతుంది.
పిల్లలకు నీతికథలను వినిపించండి. మన పెంపకాలు ఎంత పటిష్టంగా ఉన్నా పెరిగి పెద్దయ్యాక మారిపోయే వారు కూడా ఉంటారు. మన ప్రభావం కంటే దుష్టుల ప్రభావం వారిపై అధికంగా ఉండడం, లొంగిపోయే బలహీనమైన మనస్తత్వం కలిగి ఉండడం దీనికి కారణం. వ్యక్తిత్వం బలంగా ఉండాలి. బంధాలను భారంగా భావించకూడదు. మారిపోయే మనస్తత్వాల వలన వ్యక్తిత్వం దెబ్బతింటుంది. చిన్నప్పటి నుండి మంచిగా పెరిగినా, పెరిగి పెద్దయ్యాక దుర్జనుల సాంగత్యంలో దుర్వ్యధలకు బానిసలై సద్గుణాలు కోల్పోవడం ఆరోగ్యానిచ్చే ఔషధాన్ని వదిలేసి, మత్తును కలిగించే మాదకద్రవ్యాల వెంటపడడం లాంటిది. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకుండా బాల్యంలోనే సద్గుణాలకు, వివేకానికి బలమైన పునాదులు పడాలి. నేల మీద నిలబడడమే కాదు, మాట మీద నిలబడడం కూడా నేర్పాలి.



# ఇంకెలాంటి డౌట్లు అక్కర్లేదు

హరిహర వీరమల్లు పూర్తయిన ఆనందాన్ని అభిమానులు ఆస్వాదిస్తుండగానే నిన్న ఓజి షూటింగ్ పునఃప్రారంభం కావడం వాళ్లలో కొత్త జోష్ తీసుకొస్తోంది. తాజా షెడ్యూల్ లో కొందరు ఫారిన్ ఆర్టిస్టులు కూడా ఉన్నారని సమాచారం. ఈ వారంలోనే పవన్ కళ్యాణ్ సెట్స్ లోకి అడుగు పెట్టబోతున్నారు. తొలుత మంగళగిరిలో తాడేపల్లి సమీపంలో సెట్స్ వేసి ఫినిష్ చేస్తారనే టాక్ ఉన్నప్పటికీ కీలకమైన ఎపిసోడ్స్ కోసం ముంబై వెళ్లేందుకు పవన్ అంగీకారం తెలుపడంతో దర్శకుడు సుజిత్ ఆ మేరకు ఏర్పాట్లలో ఉన్నాడట. మెయిన్ విలన్ గా నటిస్తున్న బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హాష్మీ ఇదే షెడ్యూల్ లో పవన్ తో కలిసి స్క్రీన్ పంచుకోబోతున్నాడు. ప్రస్తుతానికి ఓజి పెట్టుకున్న రిలీజ్ టార్గెట్ సెప్టెంబర్ మొదటి వారం. ఇది అంత సులభం కాదు కానీ అలాని అసాధ్యమూ కాదు. పక్కా ప్రణాళికతో చేసుకుంటే రీచ్ అవ్వొచ్చు. పవన్ తాలూకు బ్యాలన్స్ జూన్ లోనే అయిపోతుందట. ఒకవేళ నిజమైతే పోస్ట్ ప్రొడక్షన్, డబ్బింగ్ తదితర కార్యక్రమాలకు తగినంత సమయం దొరుకుతుంది. సుజిత్ కష్టపడుతోంది దాని కోసమే. వీరమల్లు, ఓజిల మధ్య కేవలం మూడు నెలల గ్యాపే రాబోతున్న నేపథ్యంలో ఫ్యాన్స్ ఆసక్తి రెట్టింపవుతోంది. ఆగస్ట్ లో మిరాయ్, వార్ 2, కూలి లాంటి సినిమాలుండటంతో సెప్టెంబర్ మంచి ఆప్షన్ అవుతుంది. దసరా డేట్ పరిశీలనలో ఉంది. ప్రస్తుతానికి నిర్మాణ సంస్థ షూటింగ్ అప్డేట్ తప్ప ఇంకే వివరాలు ప్రకటించలేదు. ఇప్పటిదాకా కెమెరామెన్ గా వ్యవహరించిన రవి కె చంద్రన్ స్థానంలో మనోజ్ పరమహంస వచ్చారని లేటెస్ట్ న్యూస్. తమిళంలో రవి కె చంద్రన్ పని చేస్తున్న శివ కార్తికేయన్ పరాశక్తి డేట్లతో క్లాష్ రావడం వల్లే ఈ మార్పు అనివార్యమయ్యిందని అంటున్నారు.

# ఇంకో క్రేజీ బాలీవుడ్ ఛాన్స్?



'పెళ్ళి సందడి' అనే సబ్ స్టాండర్డ్ మూవీతో తెలుగులోకి అడుగుపెట్టింది తెలుగు మూలాలున్న కన్నడ అమ్మాయి.. శ్రీ లీల. తన తొలి సినిమా కంటెంట్ చాలా వీక్ అయినప్పటికీ.. తన అందచందాలు, డ్యాన్స్‌తో అదరగొట్టి తెలుగు ప్రేక్షకుల మనసు దోచింది. రెండో చిత్రం 'ధమాకా' హిట్ కావడంతో ఆమెకు తిరుగులేకపోయింది. కొన్నేళ్ల వ్యవధిలోనే ఆమె సినిమాల సంఖ్య డబుల్ డిజిట్‌కు చేరిపోయింది. తెలుగుకే పరమితం కాకుండా బహుభాషలకు ఆమె ప్రభ విస్తరిస్తోంది. ఆల్రెడీ తమిళంలో శివకార్తికేయన్ సరసన 'పరాశక్తి'లో నటిస్తున్న శ్రీలీలకు హిందీలో 'ఆషికి 3' లాంటి క్రేజీ మూవీలో అవకాశం దక్కిన సంగతి తెలిసిందే. ఇప్పుడు బాలీవుడ్లో ఆమెకు మరో పెద్ద ఆఫర్ దక్కినట్లు సమాచారం. బాలీవుడ్లో శ్రీలీల నటించబోయే రెండో చిత్రం కూడా సీక్వెలే కావడం విశేషం. కరణ్ జోహార్ సంస్థ 'ధర్మ ప్రొడక్షన్స్' నిర్మించబోయే ఆ చిత్రమే.. దోస్తానా 2. జాన్ అబ్రహాం, అభిషేక్ బచ్చన్ నటించిన 'దోస్తానా' పెద్ద హిట్టే అయింది. దీనికి కొనసాగింపుగా కార్తీక్ ఆర్యన్, 'కిల్' ఫేమ్ లక్ష్య, జాన్వి కపూర్‌లతో 'దోస్తానా 2' చేయాలనుకున్నారు. కానీ అది ముందుకు కదల్లేదు. కానీ ఇప్పుడు కార్తీక్ స్థానంలో విక్రాంత్ మాసే, జాన్వి స్థానంలో శ్రీలీలను ఎంపిక చేసి సినిమాను పట్టాలెక్కిస్తున్నారని సమాచారం. ఆమిర్ ఖాన్‌తో 'లాల్ సింగ్ చడ్డా' లాంటి డిజాస్టర్ తీసిన అద్వైత్ చౌహాన్ 'దోస్తానా 2'ను డైరెక్ట్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా థియేటర్లలో రిలీజ్ కాకపోవచ్చని.. నేరుగా అమేజాన్ ప్రైమ్‌లో రిలీజయ్యేలా డీల్ చేసుకుని ఈ చిత్రాన్ని పట్టాలెక్కిస్తున్నాడట కరణ్ జోహార్.

# భయానక సినిమాకు అర్ధరాత్రి ప్రీమియర్లు

చావు మీద వచ్చిన అత్యంత భీతి గొలిపే సినిమాల్లో ఫైనల్ డెస్టినేషన్ ది ప్రత్యేక స్థానం. 2000 సంవత్సరంలో ఈ ఫ్రాంచైజ్ లోని తొలి చిత్రం వచ్చింది. అనుకోని పరిస్థితుల్లో ఏదో ఒక వస్తువు లేదా మనిషి వల్ల ఊహించలేనంత దారుణంగా మనుషులు చనిపోతే ఎలా ఉంటుందో ఒళ్ళు జలదరించేలా చిత్రీకరించిన తీరు బాక్సాఫీస్ దగ్గర కనకవర్షం కురిపించింది. కలలో వచ్చే సంఘటనలు కళ్ళ ముందే నిజమవుతున్నా ఏం చేయలేని నిస్సహాయ స్థితిని చూపించిన తీరు ఆడియన్స్ ని విభ్రాంతికి గురి చేసింది. తర్వాత 2003, 2006, 2009, 2011లో వరుసగా మరో నాలుగు భాగాలు వచ్చి బ్లాక్ బస్టరయ్యాయి. ఇప్పుడు పదిహేనేళ్ల తర్వాత ఫైనల్ డెస్టినేషన్ చివరి భాగం బ్లడ్ లైన్స్ పేరుతో ఈ వారం మే 15 విడుదల కానుంది. తెలుగుతో పాటు ఇతర ప్రధాన భాషల్లో డబ్బింగ్ చేశారు. విశేషం ఇది కాదు. ఈ మూవీకి ఇండియాలో ముందు రోజు అర్ధరాత్రే స్పెషల్ ప్రీమియర్లు దేశమంతటా ప్రదర్శించబోతున్నారు.



రాత్రి 11 గంటల 59 నిమిషాలకు తొలి షో పడనుంది. మాములుగా మన దేశంలో స్టార్ హీరోలకు మాత్రమే ఇలాంటి బెనిఫిట్ షోలు వేస్తుంటారు. కానీ ఫైనల్ డెస్టినేషన్ కు ఇలా జరగడం విచిత్రమే. హైదరాబాద్, విజయవాడ, వైజాగ్ లాంటి తెలుగు రాష్ట్రాల ప్రధాన నగరాల్లోనూ ఈ షోలు ఉండబోతున్నాయి. చూస్తుంటే రాబోయే రోజుల్లో ఇదో ప్రధాన ట్రెండ్ గా మారినా ఆశ్చర్యం లేదు. బ్లడ్ లైన్స్ ట్రైలర్ చూస్తే ఈసారి హింస మోతాదు విపరీతంగా పెరిగినట్టు అనిపిస్తోంది. విజువల్స్ లో హత్యలను చూపించిన విధానం నిద్రలో సైతం వెంటాడేలా ఉంది. దీంతో ఈ హారర్ క్రైమ్ థ్రిల్లర్ కి ముగింపు పలకబోతున్నారు. తొలుత పుస్తకంగా ఫైనల్ డెస్టినేషన్ పది భాగాలుగా వచ్చింది.

# హీరో విశాల్ ఆరోగ్యంపై క్లారిటీ..

తమిళంలో యాక్షన్ సినిమాలకు పేరుపడ్డ విశాల్.. గతంలో చాలా ఫిట్ గా కనిపించేవాడు. తమిళంలో ముందుగా సిక్స్ ప్యాక్ చేసిన హీరోల్లో అతనొకడు. తన సినిమాల శైలికి తగ్గట్లే అతనపుడు చాలా దృఢంగా కనిపించేవాడు. ఐతే ఎలాంటి హీరోకైనా వయసు పెరిగేకొద్దీ ఫిట్‌నెస్ తగ్గడం మామూలే. విశాల్ కూడా అందుకు మినహాయింపు కాలేకపోయాడు. గత కొన్నేళ్లలో వచ్చిన సినిమాల్లో తన లుక్ దెబ్బ తింది. ఐతే అంత వరకు ఓకే కానీ.. ఇటీవల విశాల్ తీవ్ర అనారోగ్యం దెబ్బ తిన్నట్లు వార్తలు రావడంతో అభిమానులు కంగారు పడ్డారు. తన లాంగ్ డిలేయ్డ్ మూవీ 'మదగజ రాజా' సంక్రాంతి టైంలో రిలీజైనపుడు విశాల్ చాలా ఇబ్బందికరంగా కనిపించడం, మైక్ పట్టుకుని మాట్లాడుతుంటే తన చేతులు వణకడం, ముఖంలో మార్పు రావడం చర్చనీయాంశం అయింది. కొన్ని రోజులకు అతను కోలుకున్నట్లే కనిపించాడు. అంతటితో కథ సుఖాంతం అయిందనుకుంటే.. తాజాగా విశాల్ ఒక కార్యక్రమం సందర్భంగా స్టేజ్ మీద కళ్లు తిరిగి పడిపోవడం, అతణ్ని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించాల్సిన పరిస్థితి రావడంతో మళ్లీ అభిమానుల్లో టెన్షన్ మొదలైంది. విశాల్‌కు ఏదైనా తీవ్ర అనారోగ్య సమస్య ఉందా అన్న చర్చ జరుగుతోంది. ఐతే లేటెస్ట్ ఇన్సిడెంట్ గురించి విశాల్ మేనేజర్ మీడియాకు క్లారిటీ ఇచ్చాడు. విశాల్ ఆహారం తీసుకోకపోవడం వల్ల కళ్లు తిరిగి పడిపోయాడని.. అంతకుమించి ఏమీ లేదని.. చికిత్స అనంతరం కోలుకున్నాడని చెప్పాడు. కానీ ఇదే అసలైన కారణమా అని మీడియా వాళ్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. 'మదగజ రాజా' టైంలో హై ఫీవర్ వల్లే విశాల్ చేతులు వణికాయన్నారు. కానీ ఆ మాత్రానికే అలా అవుతుందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడు ఫుడ్ తీసుకోకపోవడం వల్లే విశాల్ అలా పడిపోయాడన్నా కూడా నమ్మకం కలగట్లేదు. విశాల్ సమస్య ఏదైనప్పటికీ అతను దాన్నుంచి పూర్తిగా కోలుకుని మళ్లీ ఫిట్‌గా తయారవ్వాలని, ఒకప్పట్లాగే హుషారుగా సినిమాలు చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు.



# పూరి సినిమాలో పెరుసు హీరోయిన్

ఈ మధ్య కాలంలో ఓటీటీల్లో బాగా ట్రెండ్ అయిన సినిమా.. పెరుసు. లెజెండరీ తెలుగు డైరెక్టర్ కోదండరామిరెడ్డి తనయులు వైభవ్ రెడ్డి, సునీల్ రెడ్డి ఇందులో ముఖ్య పాత్రలు పోషించారు. ప్లాట్ పాయింట్ అడల్ట్ టచ్ ఉన్నదే అయినా.. హద్దులు దాటని కామెడీతో ఈ సినిమాను భలేగా నడిపించి మెప్పించింది చిత్ర బృందం. తమిళంతో పాటు వేరే భాషల వాళ్లూ ఈ సినిమాను బాగా చూశారు. ఈ చిత్రంలో వైభవ్‌కు జోడీగా నటించి మెప్పించిన అమ్మాయి నిహారిక ఎన్ఎం. సోషల్ మీడియాను ఫాలో అయ్యేవారికి ఈ అమ్మాయి గురించి పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఇన్‌స్టాలో ఏకంగా 35 మిలియన్ల ఫాలోవర్లున్నారు ఆ అమ్మాయికి. గతంలో మహేష్ బాబు సైతం ఈ అమ్మాయితో కలిసి తన ప్రొడక్షన్లో వచ్చిన 'మేజర్' మూవీని ప్రమోట్ చేయడం విశేషం. ఇప్పుడు నిహారిక ఒక పాన్ ఇండియా మూవీలో అవకాశం దక్కించుకుంది. ఆ సినిమాను డైరెక్ట్ చేయబోయేది పూరి జగన్నాథ్ కావడం విశేషం. విజయ్ సేతుపతి హీరోగా పూరి ఇటీవలే ఓ సినిమాను అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే.



ఇందులో టబు, దునియా విజయ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంలో సేతుపతికి జోడీగా అనేక పేర్లను పరిశీలించిన చిత్ర బృందం.. చివరికి నిహారికను ఎంపిక చేసినట్లు సమాచారం. 'పెరుసు' సినిమాలో నిహారిక పెర్ఫామెన్స్ నచ్చి ఆమెను పిలిచి ఆడిషన్ చేసింది చిత్ర బృందం. అందులో ఇంప్రెస్ చేయడంతో ఆమెనే ఫైనలైజ్ చేశారట. ఇందులో అన్నీ పెర్ఫామెన్స్ ఓరియెంటెడ్ రోల్సే ఉంటాయని.. నిహారికది కూడా అలాంటి పాత్రే అని సమాచారం. తన కెరీర్‌ను మలుపు తిప్పే సినిమాగా ఇది నిలవడం ఖాయం అంటున్నారు. ఇక ఈ చిత్రంలో రాధికా ఆప్టే నటిస్తోందనే వార్తలు నిజం కాదని తెలిసింది. వచ్చే నెలలో ఈ చిత్రం సెట్స్ మీదికి వెళ్లనుంది.



# కమలేష్ జగన్ పాత్రకు ఫిదా

కోలీవుడ్‌లో ప్రస్తుతం బాగా ట్రెండిరగ్‌లో ఉన్న సినిమా 'టూరిస్ట్ ఫ్యామిలీ'. ఈనెల ఒకటోతేదీన విడుదలైన ఈ సినిమా బాక్సాఫీసు వద్ద వసూళ్ల వర్షాన్ని కురిపిస్తోంది. కొత్త దర్శకుడు అభిషాన్ జీవింత్ దర్శకత్వంలో శశికుమార్, సిమ్రాన్ జంటగా నటించారు. బాలనటుడు కమలేష్ జగన్ నటన బాగుందని తమిళ ప్రేక్షకులు అభినందించారు. కథానాయకుడు శివకార్తికేయన్ ఈచిత్ర బృందాన్ని పిలిపించి అభినందించారు. ప్రత్యేకంగా కమలేష్‌ను మెచ్చుకున్నారు. తాజాగా రజనీకాంత్ కూడా ఈ చిత్రం సూపర్ అంటూ కితాబిచ్చారు. టూరిస్ట్ ఫ్యామిలీలో శశికుమార్, సిమ్రాన్‌ల కుమారుడిగా దళపతి విజరు అభిమానిగా నటించి మెప్పించారు. 'సరే గమప లిల్ చాంప్స్ సీజన్ 2'లో కమలేష్ మొదటిసారి తెరపై మెరిశాడు. ఆ రియాల్టీ షోకు అతిథులుగా త్రిష కృష్ణన్, నయనతార, అమలాపాల్ హాజరై ప్రశంసలు కురిపించారు. నటి జ్యోతిక తమిళ చిత్రం 'రాచ్చసి'లో కమలేష్‌కు అవకాశం ఇప్పించారు. ఆ తర్వాత 'కణ్మనీ రాంబో ఖతీజా' చిత్రంలో ఛాన్స్ లభించింది. విజరు దళపతి కుమారుడు జాసన్ సంజరు దర్శకత్వం వహించిన తొలి సినిమాలో కూడా కమలేష్ నటిస్తున్నాడు. ఆపై కాంచన 4లో కూడా ఛాన్స్ కొట్టేశాడు.

# నవీన్ చంద్ర, సందీప్ కిషన్ పవర్‌ఫుల్ కథతో 'ఎలెవెన్'

నవీన్ చంద్ర హీరోగా నటించిన బైలింగ్వల్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'ఎలెవెన్'. సుందర్ సి వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వం వహించారు. ఏఆర్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మిస్తున్నారు. రుచిర ఎంటర్టైన్మెంట్స్ అధినేత, డిస్ట్రిబ్యూటర్ ఎన్.సుధాకర్ రెడ్డి ఈ సినిమా థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకున్నారు. ఈనెల 16న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. సందీప్ కిషన్ చీఫ్ గెస్ట్‌గా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది. హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ, 'ఇప్పటివరకు సినిమా చూసిన వాళ్ళందరూ కూడా చాలా బాగుందని చెప్పారు. వాళ్ల రియాక్షన్స్ చూసినప్పుడు నాకు మరింత కాన్ఫిడెన్స్ వచ్చింది. ఈనెల 15న ఈ సినిమా పెయిడ్ ప్రీమియర్స్‌ని ప్లాన్ చేశాం. పెయిడ్ ప్రీమియర్స్ నుంచి చూసి ఆడియన్స్ బయటకు వచ్చినప్పుడు నేను అక్కడే నిల్చుని ఉంటాను ఒకవేళ మీకు సినిమా నచ్చకపోయి ఉంటే మీ టికెట్ ని వెనక్కి అడిగే హక్కు మీకు ఉంది. ఒకవేళ సమయం వృధా అయిందని అనిపించినా ప్రశ్నించే హక్కు కూడా మీకు ఉంటుంది. నేను చేసే కథలు, పాత్రలు బావుంటాయని ప్రేక్షకులు మొదట నుంచి ప్రశంసిస్తున్నారు. ఆ గౌరవానికి రిటర్న్‌గా ఈ సినిమా ఉంటుందని నమ్ముతున్నాను. ఈ సినిమాని నిర్మాతలు ఎంతో ఫ్యాషన్‌తో తీశారు. ఆడియన్స్‌కి గ్రేట్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలని ఉద్దేశంతో తీసిన సినిమా ఇది. నా కథే నా బలం. ఖచ్చితంగా ఈ సినిమా మీకు నచ్చుతుంది. ఈ సినిమాలో ఉన్న యూనిక్ కాన్సెప్ట్‌ని ఇప్పటివరకు మీరు ఏ థ్రిల్లర్‌లో కూడా చూసి ఉండరు. ఒక 30 మినిట్స్ చాలా ఎమోషన్‌కి గురి అవుతారు. ఆ ఎమోషన్ ఆడియన్స్‌కి ఓ మంచి అనుభూతినిస్తుంది. మా ట్రైలర్‌ని లాంచ్ చేసిన కమల్ హాసన్‌కి ధన్యవాదాలు. ఆయన లాంచ్ చేయడంతో ట్రైలర్ చాలా అద్భుతమైన రీచ్‌తో వెళ్ళింది' అని తెలిపారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక




## కోహ్లీ రిటైర్మెంట్ పై ఎమోషనల్ అయిన మియాన్ భాయ్!

విరాట్ కోహ్లీ టెస్ట్ రిటైర్మెంట్‌కు మహ్మద్ సిరాజ్ ఇచ్చిన భావోద్వేగ నివాళి హృదయాలను తాకింది. "నా సూపర్ హీరోకి..." అంటూ ప్రారంభమైన అతని పోస్ట్, కోహ్లీతో ఉన్న బంధాన్ని ప్రతిబింబించింది. కోహ్లీ ఆటలోనే కాదు, జీవితంలోనూ తనకు మార్గదర్శకుడిగా ఉన్నారని సిరాజ్ తెలిపాడు. కోహ్లీ ప్రేరణ మరెన్నో తరాల క్రికెటర్లలో జీవించనుంది. భారత క్రికెట్‌కు ఒక శకం ముగిసింది. విరాట్ కోహ్లీ తన అద్భుతమైన టెస్ట్ కెరీర్‌కు వీడ్కోలు పలికిన క్షణం, క్రికెట్ ప్రపంచం మొత్తం అతనికి ధన్యవాదాలు తెలిపింది. కానీ ఈ నివాళులన్నింటిలో ప్రత్యేకంగా నిలిచినది భారత స్పీడ్‌స్టర్ మహమ్మద్ సిరాజ్ పోస్ట్. "నా సూపర్ హీరోకి" అంటూ మొదలైన అతని మాటలు అభిమానులను కన్నీటి పర్యంతం చేశాయి. ఇది కేవలం సామాజిక మాధ్యమాలలో పోస్టు కాదు, అది ఒక జీవితాన్ని మార్చిన వ్యక్తికి తమ్ముడు ఇచ్చిన హృదయపూర్వక సెల్యూట్. సిరాజ్ కోహ్లీని గురువు అనే పదంతో కాకుండా, "సూపర్ హీరో" అనే సూటి పదంతో గుర్తించడం, ఆ ఇద్దరి మధ్య ఉన్న అనుబంధాన్ని చెబుతుంది. కోహ్లీ సిరాజ్‌కి కేవలం సీనియర్ ఆటగాడు కాదు, అతని ప్రేరణ, ఆదరణ ఇచ్చే అన్నయ్య. విరాట్ కోహ్లీ టెస్ట్ కెరీర్‌ను సిరాజ్ "అద్భుతమైన కెరీర్"గా అభివర్ణించాడు. 123 టెస్టుల్లో 9230 పరుగులు, 30 సెంచరీలు, కెప్టెన్‌గా 40 విజయాలు సాధించడమే కాకుండా, కోహ్లీ తనకంటే తక్కువ అనుభవం ఉన్న ఆటగాళ్లకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచాడు. అయితే సిరాజ్ తన నివాళిలో గణాంకాల కంటే ఎక్కువగా 'వారసత్వాన్ని' ప్రస్తావించాడు. కోహ్లీ తన మానసిక బలంతో, ఫిట్‌నెస్‌తో, అంకితభావంతో భారత క్రికెట్‌ను ఒక కొత్త దిశగా నడిపించాడని ఆయన అన్నారు. కోహ్లీ డ్రెస్సింగ్‌రూమ్‌లో లేకపోవడం ఒక శూన్యాన్ని సృష్టిస్తుందని, అది ఎప్పటికీ భర్తీ అయ్యే పరిస్థితి కాదని చెప్పడం సిరాజ్‌కు అతనంటే ఎంతగా ఇష్టమో సూచిస్తుంది. "ఎల్లప్పుడూ నాతో ఉన్నందుకు ధన్యవాదాలు, భయ్యా" అంటూ తన భావోద్వేగాన్ని పంచుకున్నాడు.విరాట్ టెస్ట్ వారసత్వం కేవలం పరుగులు లేదా సెంచరీల విషయంలో కాకుండా, అతను ఆటపై చూపిన ప్యాషన్, నైతికత, భారత జట్టులోని స్థాయిని ఎత్తిపోతల చేసిన మార్గదర్శకతలో ఉంది. అతను టెస్ట్ ఫార్మాట్‌ను ప్రేమించాడు, గౌరవించాడు, శాసించాడు. అతను ఆసీస్‌లో భారత్‌కు తొలి టెస్ట్ సిరీస్ గెలిపించిన నాయకుడు. అతని ఫిట్‌నెస్ సంస్కృతిని టీమ్‌లో నాటిన నాయకుడు. ఆటను ఒక అత్యున్నత స్థాయిలో తీసుకెళ్లిన ప్రయాణికుడు. ఈ క్రమంలో, మహమ్మద్ సిరాజ్ తరపున వచ్చిన ఈ "సూపర్ హీరో"కు నివాళి ఒక తమ్ముడు తన అన్నకి చెప్పిన ఎమోషనల్ వ్యాఖ్య. కోహ్లీ టెస్ట్ నుంచి తప్పుకున్నా, అతని ప్రభావం ఆటలో నిరంతరం ఉండబోతుంది. మరెన్నో తరం క్రికెటర్లకు, అభిమానులకు, అతను 'సూపర్ హీరో'గానే నిలిచిపోతాడు.

## డబ్ల్యూటీసీ ఫైనల్‌కు తుది టీమ్‌ను ప్రకటించిన కంగారులు!

ఆస్ట్రేలియా డబ్ల్యూటీసీ ఫైనల్, వెస్టిండీస్ టూర్‌ల కోసం అనుభవజ్ఞులూ, యువతతో కూడిన తుది జట్టును ప్రకటించింది. కామెరాన్ గ్రీన్ తిరిగి రావడం, సామ్ కాన్స్టాస్ ఓపెనర్‌గా ఎంపిక కావడం విశేషం. బౌలింగ్ విభాగంలో స్కాట్ బోలాండ్‌తో పాటు స్టార్క్, కమ్మిన్స్, హేజిల్‌వుడ్‌లు ఉన్నారు. జట్టు బలమైనదిగా ఉండటంతో అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌తో పాటూ, వెస్టిండీస్ పర్యటన కోసం 16 మంది సభ్యులతో కూడిన బలమైన, అనుభవం కలిగిన జట్టును ప్రకటించింది. పాట్ కమ్మిన్స్ నేతృత్వంలోని ఈ జట్టులో అనేక ప్రధాన ఆటగాళ్లతో పాటు కొత్త అవకాశాలు అందుకున్న ఆటగాళ్లకు కూడా చోటు కల్పించారు. ముఖ్యంగా, వెన్ను శస్త్రచికిత్స అనంతరం తిరిగి వచ్చిన ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ పునరాగమనం ఆస్ట్రేలియా జట్టుకు బలాన్ని చేకూర్చింది. అతని తిరిగివచ్చే అంశం టెస్ట్ క్రికెట్లో ఆస్ట్రేలియా ఆల్‌రౌండ్ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు. అలాగే, దేశీయ క్రికెట్‌లో మెరుగైన ప్రదర్శనలతో ఆకట్టుకున్న బ్యూ వెబ్‌స్టర్‌కు ఎంపిక జరగడం గమనార్హం.బ్యాటింగ్ విభాగంలో, టాప్ ఫామ్‌లో ఉన్న ట్రావిస్ హెడ్, స్టీవ్ స్మిత్, మార్నస్ లాబుస్చాగ్నే, ఉస్మాన్ ఖవాజా లాంటి అనుభవజ్ఞులు ఉన్నారు. వికెట్ కీపర్లుగా అలెక్స్ కారీ, జోష్ ఇంగ్లిస్‌లు ఎంపికయ్యారు. స్పిన్ విభాగంలో నాథన్ లియాన్, మాథ్యూ కుహ్నెమాన్ కీలక పాత్ర పోషించనున్నారు. ఇక




ఫాస్ట్ బౌలింగ్ విభాగాన్ని పాట్ కమ్మిన్స్, మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్, స్కాట్ బోలాండ్‌ల బృందం నాయకత్వం వహించనుంది. ఇది ప్రత్యర్థి జట్లకు గట్టి పోటీని అందించే బౌలింగ్ దళంగా మారుతుంది. ఒక ఆశ్చర్యకరమైన ఎంపికగా సామ్ కాన్స్టాస్‌ను ఓపెనింగ్ బ్యాట్స్‌మన్‌గా జట్టులో చేర్చారు. భారత్‌తో జరిగిన బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీలో అతను చూపించిన ప్రతిభ జట్టు సెలెక్షన్‌లో కీలకంగా మారింది. మరోవైపు, ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 48 మ్యాచ్‌ల్లో 177 వికెట్లు తీసిన బ్రెండన్ డాగెట్ ట్రావెలింగ్ రిజర్వ్‌గా ఎంపికయ్యాడు. అతనికి ఇది అంతర్జాతీయ స్థాయిలో మరో అవకాశంగా మారవచ్చు. ఈ జట్టు లార్డ్స్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరుగనున్న ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ తుదికి, ఆ తర్వాతి వెస్టిండీస్ టెస్ట్ సిరీస్‌కు మార్పులు లేకుండానే ఎంపిక చేయబడిరది. ఈ నిర్ణయం జట్టులో స్థిరత్వాన్ని కల్పించే ప్రయత్నంగా భావించవచ్చు. ఆసక్తికరంగా, జట్టులో అనుభవం, యువ శక్తికి సమతుల్యత ఉండేలా సెలెక్షన్ జరగడం, ఆస్ట్రేలియా క్రికెట్ దృష్టిని భవిష్యత్తుపై సారించడం స్పష్టమవుతోంది.




## రోహిత్ - విరాట్ స్థానాలను భర్తీ చేసేదెవరు ?

దశాబ్దానికిపైగా టెస్ట్ క్రికెట్‌ను ఏలిన రోహిత్ విరాట్.. ఆ ఫార్మాట్‌కి వీడ్కోలు పలికారు. దిగ్గజ ద్వయం రిటైర్మెంట్‌తో వాళ్ల స్థానాలను ఏ ప్లేయర్లతో భర్తీ చేయబోతున్నారు? ఇంగ్లండ్ సిరీస్‌లో వాళ్ల ఏ మేర రాణిస్తారు? ఇప్పుడిదే టాపిక్ స్పోర్ట్స్ సర్కిల్‌స్‌ని ఊపేస్తోంది. ఒకరు హిట్ మ్యాన్.. మరొకరు రన్‌మెషిన్.. వీరకొట్టుడు.. నాటుకొట్టుడు.. దంచికొట్టుడుకి కేరాఫ్ అడ్రస్.. వీళ్లిద్దరూ ఆడుతుంటే అభిమానికి పండుగే.. అయితే.. ఉన్నట్టుండి రోజుల వ్యవధిలో ఇద్దరూ లాంగ్ ఫార్మాట్‌కి వీడ్కోలు పలికారు. ఈ అనూహ్య నిర్ణయం క్రికెట్ లవర్స్‌ని డిసప్పాయింట్ చేసింది. దశాబ్దకాలంగా టీమిండియాకు మూలస్థంభాలుగా నిలిచారు రోహిత్, విరాట్. గతేడాది టీ20 ప్రపంచకప్ సాధించాక.. ముందుగా కోహ్లీ ఆ తర్వాత రోహిత్ పొట్టి ఫార్మాట్‌కి రిటైర్మెంట్ ప్రకటించారు. టెస్ట్ క్రికెట్ విషయంలోనూ వీళ్లిద్దరూ దాదాపు ఒకే సమయంలో వీడ్కోలు పలికారు. అయితే వీళ్లిద్దరి విషయంలో బీసీసీఐ భిన్నంగా ప్రవర్తించిందనే ఆరోపణలు వస్తున్నాయి.

గత కొంతకాలంగా టెస్ట్ ఫార్మాట్‌లో విఫలమవుతున్న రోహిత్ .. ఈనెల 7న సెలక్టర్లతో సమావేశమయ్యాడు. ఆ తర్వాత హఠాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఘోరంగా విఫలమైన రోహిత్.. ఐదో టెస్ట్‌లో స్వయంగా తప్పుకున్నాడు. ఇక భవిష్యత్ ప్రణాళికలో రోహిత్ లేడని బోర్డ్ చెప్పడంతో.. టెస్ట్ ఫార్మాట్ నుంచి తప్పుకున్నాడు. రోహిత్ తర్వాత కోహ్లీ కూడా తన వీడ్కోలు నిర్ణయాన్ని ప్రకటించాడు. దీంతో డెసిషన్ వెనక్కి తీసుకోవాలని బీసీసీఐ ఒత్తిడి చేసిందని తెలుస్తోంది. కానీ కోహ్లీ మాత్రం ససేమిరా అన్నాడట. ఇద్దరు స్టార్ ప్లేయర్ల విషయంలో బీసీసీఐ భిన్నంగా ప్రవర్తించిందన్న ఆరోపణలు మిన్నంటుతున్నాయి. దిగ్గజాల టెస్ట్ కెరీర్ ఒకే నెలలో ముగియడంతో భారత అభిమానులు నిరాశలో మునిగిపోయారు. వచ్చే నెల 20 నుంచి ఇంగ్లండ్‌లో ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ప్రారంభంకానుంది. ఆ సిరీస్‌లో ఈ ద్వయం లేని లోటు ఏ ఆటగాళ్లతో భర్తీ చేస్తారనే చర్చ మొదలైంది. ఈ రేసులో పలువురు యంగ్‌స్టర్లు కనిపిస్తున్నారు. రెడ్‌బాల్ క్రికెట్‌లో సర్ఫరాజ్ అసాధారణ ప్రతిభ కనబరుస్తున్నాడు. మిడిల్ ఆర్డర్‌ను బలోపేతం చేయడానికి సర్ఫరాజ్ మంచి పోటీ ఇవ్వగలడు. ఇక జట్టు అవసరాల దృష్ట్యా కేఎల్ రాహుల్ ఏ స్థానంలోనైనా ఆడుతూ రాణిస్తున్నాడు. కొన్నిసార్లు ఓపెనర్‌గా మరికొన్నిసార్లు మిడిల్ ఆర్డర్‌లో.. ఇంకొన్ని సార్లు లోయర్ ఆర్డర్‌లో అదరగొడుతున్నాడు. కోహ్లీ రిటైర్మెంట్‌తో 4వ ప్లేస్‌లో ఆడటం దాదాపు ఖాయం కావొచ్చు. విరాట్ ప్లేస్‌ని శ్రేయస్ అయ్యర్‌తో భర్తీ చేస్తారనే టాక్ కూడా బాగా వినిపిస్తోంది. సాయి సుదర్శన్ ఐపీఎల్‌లో బాగా రాణిస్తున్నాడు.




## ఇక అంతా అతడి చేతుల్లో

కేవలం అయిదు రోజుల వ్యవధిలో ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లు భారత టెస్టు జట్టును వీడారు. ముందుగా కెప్టెన్ రోహిత్ శర్మ సుదీర్ఘ ఫార్మాట్‌కు టాటా చెప్పేయగా.. తాజాగా కోహ్లీ సైతం అతడి బాటలోనే నడిచాడు. దీంతో ఒక్కసారిగా భారత టెస్టు జట్టు కళ తప్పిన భావన కలుగుతోంది అభిమానులకు. రోహిత్, కోహ్లీ చరమాంకంలో ఉన్న సంగతి తెలిసిందే కానీ.. ఇప్పుడిలా ఉన్నట్లుండి ఇద్దరూ ఒకేసారి రిటైరైపోతారని అభిమానులు ఊహించి ఉండరు! రోహిత్ నిష్క్రమణతో జట్టుకు కొత్త కెప్టెన్ రాబోతున్నాడు. కుర్రాడైన శుభ్‌మన్ గిల్ పగ్గాలు అందుకోవచ్చని భావిస్తున్నారు. ఇక సచిన్, కోహ్లీ లాంటి దిగ్గజ బ్యాటర్లు ఆడిన నాలుగో స్థానాన్ని ఇకపై ఎవరు భర్తీ చేస్తారన్నది ఆసక్తికరం. ఈ సంగతి పక్కన పెడితే.. జట్టులో ఇక మిగిలిన సీనియర్ ఆటగాళ్లంటే రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్, జస్‌ప్రీత్ బుమ్రా మాత్రమే. జడేజా కూడా ఇంకెంతో కాలం జట్టులో కొనసాగకపోవచ్చు. బుమ్రా గాయాలతో జట్టులోకి వస్తూ పోతూ ఉన్నాడు. రాహుల్ నిలకడ అందుకుంటే తప్ప స్టార్ ఆటగాడిగా గుర్తింపు రాదు. ఈ నేపథ్యంలో ఎక్కువగా వర్ధమాన ఆటగాళ్లతో కూడిన జట్టుపై కోచ్ గంభీర్‌కు పూర్తిగా పట్టు చిక్కడం ఖాయం. జట్టు సెలక్షన్, మ్యాచ్ ప్రణాళికలు.. ఇలా అన్నింట్లోనూ గౌతీ ముద్ర ఉండబోతోందన్నది స్పష్టం. ప్రస్తుతం జట్టులో అతడి మాటకు ఎదురుండదని చెప్పొచ్చు. ప్రయోగాలు చేయడానికి ఆస్కారముంది. అయితే అనుభవం కొరవడిన ఈ జట్టును నడిపించడం గంభీర్‌కు అంత తేలికేమీ కాదు. రోహిత్, కోహ్లీ రిటైరయ్యాక ఆడబోయే తొలి సిరీసే అత్యంత కఠినమైంది. ఇంగ్లాండ్‌లో యువ జట్టుతో నెట్టుకురావడం సవాలే. ఈ సిరీస్‌లో జట్టు విఫలమైతే.. కోచ్‌గా గంభీర్ ఖాతాలో వరుసగా మూడో పరాభవం జమ అవుతుంది. అప్పుడతను తీవ్ర ఒత్తిడిలో పడతాడు. కానీ ఈ జట్టుతో ఇంగ్లాండ్‌లో విజయం సాధిస్తే మాత్రం కోచ్‌కు గొప్ప పేరు వస్తుంది. అప్పుడు భారత క్రికెట్లో నవశకం ఆరంభమైనట్లే. మరి సంధి దశలో ఉన్న జట్టును గంభీర్ ఎలా నడిపిస్తాడో చూడాలి.

### గంభీర్ పాత్ర ఉందా?

రోహిత్, కోహ్లీ హఠాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించడంలో కోచ్ గంభీర్ పాత్ర గురించి ఇప్పుడు ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఆస్ట్రేలియా పర్యటన సమయంలోనే వీళ్లిద్దరి రిటైర్మెంట్ గురించి చర్చ జరిగింది. కానీ ఇద్దరూ ఆ ప్రచారాన్ని ఖండించారు. ఇంగ్లాండ్ పర్యటనలో ఆడాలనుకుంటున్నట్లు సంకేతాలు ఇచ్చారు. దానికి సంబంధించిన సన్నాహాల్లోనే ఉన్నారు. కానీ ఇప్పుడేమో ఒకరి తర్వాత ఒకరు రిటైర్మెంట్ ప్రకటన ఇచ్చేశారు. బీసీసీఐ ఒత్తిడితోనే వీళ్లు హఠాత్తుగా రిటైరవ్వాల్సి వచ్చిందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇంగ్లాండ్ సిరీస్‌తోనే కొత్త టెస్టు ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆరంభం కానున్న నేపథ్యంలో జట్టులోకి కొత్త ముఖాలు కావాలని కోచ్ గంభీర్ బీసీసీఐకి స్పష్టం చేశాడని.. ఈ నేపథ్యంలోనే రోహిత్, కోహ్లీలను కెరీర్‌పై ఓ నిర్ణయం తీసుకోవాలన్న సంకేతాలు ఇచ్చారని.. గత రెండు సిరీస్‌ల్లో ఘోరంగా విఫలమైన నేపథ్యంలో వీళ్లిద్దరూ కొనసాగుతామని గట్టిగా చెప్పలేని స్థితిలో రిటైర్మెంట్ ప్రకటించేశారని భారత క్రికెట్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## రెండో స్థానానికి స్మృతి




ఐసీసీ మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో భారత స్టైలిష్ ఓపెనర్ స్మృతి మంధాన రెండో స్థానానికి ఎగబాకింది. శ్రీలంకలో భారత్ ముక్కోణపు సిరీస్ నెగ్గడంలో కీలక పాత్ర పోషించిన ఆమె ఒక ర్యాంకును మెరుగుపర్చుకుంది. సిరీస్‌లో స్మృతి అయిదు ఇన్నింగ్స్‌ల్లో 264 పరుగులు సాధించింది. ఫైనల్లో శ్రీలంకపై 101 బంతుల్లో 116 పరుగులు చేసింది. నంబర్‌వన్ బ్యాటర్ లారా వోల్వార్ట్‌కు ఆమె కేవలం 11 రేటింగ్ పాయింట్ల దూరంలో ఉంది. స్మృతి చివరిసారి 2019లో అగ్రస్థానం సాధించింది. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో దీప్తి శర్మ నాలుగో స్థానంలో ఉంది. సోఫీ ఎకిల్‌స్టోన్ నంబర్‌వన్ బౌలర్‌గా కొనసాగుతోంది. ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో ఆష్లీ గార్డ్‌నర్ తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది.

## కోహ్లీకి వెల్లువెత్తిన అభినందనలు..

టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన విరాట్ కోహ్లీకి క్రీడా ప్రముఖులు అభినందనలు తెలుపుతున్నారు. క్రికెట్ దిగ్గజం సచిన్‌తో సహా పలువురు మాజీ క్రికెటర్లు, ప్రస్తుత ఆటగాళ్లు కోహ్లీ సేవలను కొనియాడారు. అతనిలాంటి క్రికెటర్ చాలా అరుదుగా లభిస్తాడని సచిన్ పేర్కొన్నాడు. యువ క్రికెటర్లు తమ కలలను సాకారం చేసుకునేలా కోహ్లీ వారసత్వాన్ని నిర్మించాడని ప్రశంసించాడు. భారత క్రికెట్‌పై చెరగని ముద్ర వేశాడని కొనియాడాడు. వీరేంద్ర సెహ్వాగ్, యువరాజ్ సింగ్, గౌతం గంభీర్, ద్రవిడ్, లక్ష్మణ్, కైఫ్, జహీర్ ఖాన్, హర్భజన్ తదితరులు సయితం కోహ్లీని ప్రశసంలతో ముంచెత్తారు. ఈ సందర్భంగా కోహ్లీ సతీమణి అనుష్క శర్మ పెట్టిన ఎమోషనల్ పోస్టు వైరల్‌గా మారింది. అనుష్క తన భర్త కోహ్లీ గురించి భావోద్వేగ పోస్టును షేర్ చేసింది. అంద రూ రికార్డుల, మైలురాళ్ల గురించే మాట్లాడవచ్చు. నాకు మాత్రం నువ్వు దాచుకున్న కన్నీళ్లు.. ఎవరికి తెలియకుండా నీతో ను వ్వు చేసిన యుద్ధలు చిరకాలం గుర్తుండిపోతాయి. టెస్టు క్రికెట్‌పై నీకు న్న ప్రేమ, అంకిత భావాన్ని ఎప్పటికీ మరచిపోలేను. ప్రతి టెస్టు సిరీస్ తర్వాత నువ్వు ఎంతో గొప్పగా తిరిగి వచ్చేవాడివి. నువ్వు ఎదిగిన వి ధానాన్ని పక్కన ఉండి చూడడం తనకు లభించిన అరుదైన గౌరవంగా భావిస్తానని అనుష్క పేర్కొంది. ప్రతి ఆటగాడి కెరీర్‌లో ఏదో ఒకరోజు రిటైర్మెంట్ ఉంటుందని, నీవు టెస్టుల నుంచి రిటైర్ అవుతావని తెలు సు. ఆటలో నీవు సాధించనిది ఏదీ లేదని, టెస్టులకు గుడ్‌బై చెప్పేందుకు ఇదే మంచి సమయమని నీవు భావించి తీసుకున్న నిర్ణయాన్ని భార్యగా తాను గౌరవిస్తానని అనుష్క తన పోస్టులో తెలిపింది.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in